# సుందరయ్య చేసిన పోరాటాలు చిరస్మరణీయం

గూడూరు, మే 31 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో శుక్రవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య రచనల సంకలనం పుస్తకం గూడూరు సిపిఎం సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగి శివకుమార్ మాట్లాడుతూ కమ్యూనిస్టు మహా నాయకుడు ప్రజా ఉద్యమాల నిర్మాత పుచ్చల పల్లి సుందరయ్య రచనల సంకలనం పుస్తకంలో దేశ, రాష్ట్ర భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దు కోవాలి, ప్రజలు సమస్యల పరిష్కారానికి, భూ సమస్యలపై పరిష్కారానికి అనుసరించవల్సిన విధానాలను ఈ పుస్తకంలో పొందుపరిచారన్నారు. ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి సర్వే జరిపి ఆయన చేసిన పోరాటాలు మొత్తంగా ఈ రచనల ద్వారా ప్రజల లో యువకులలో పోరాట స్ఫూర్తిని పెంపొందించుకోవచ్చున్నారు. రాజ్యసబలో, శాసనసభలో ఆయన చేసిన ప్రసంగాలు ఆయన ప్రగాఢమైన అధ్యాయానికి నిదర్శనాలు అన్నారు. జాతీయ అంతర్జాతీయ మార్పులు సంభవించిన ఒకటి రెండు విషయాల్లో ఉన్న మౌలిక పాఠాలు దాదాపు ఎప్పటికి వర్తించేవే అని తెలిపారు. కార్యకర్తలు విషయ పరిజజ్ఞానం పెంచుకోవాలని, అధ్యయన శీలులందరికీ ఆవశ్య పటనీయమని వారు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు పామంజి మణి, బివి రమణయ్య, ఎస్. సురేష్, ఆడపాల ప్రసాద్, బి. నారాయణ, ఏంబేటి చంద్రయ్య, బి. చంద్రయ్య, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య రచనల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఎగ్జిట్ టెన్షన్

**- ప్రధాన పార్టీల అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతల్లో ఉత్కంఠత**
**- ఎగ్జిట్ పోల్ ఫలితాలపై ప్రతి ఒక్కరిలో ఆసక్తి**



చిత్తూరు, మే 31 ప్రభాతవార్త: వాస్తవ ఎన్నికల ఫలితాలు ప్రకటించడానికి ముందుగా పోలింగ్ రోజున ఓటర్ల నాడిని గుర్తించి పలు సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు శనివారం సాయంత్రం 6.30 గంటలకు పైగా విడుదల కానుండటంతో సర్వత్రా టెన్షన్ నెలకొంది. ఎగ్జిట్ పోల్స్ విడుదలకు ఎలక్షన్ కమీషన్ చివరి దశ పోలింగ్ ముగిసే వరకు అంక్షలు పెట్టడంతో సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసిన వారితో పాటు ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ వెల్లడిపై ఎలక్షన్ కమీషన్ నిషేధం వుండటంతో సోషల్ మీడియాలో ఇప్పటికే పలు సంస్థలు పోలింగ్ అంచనాల పేరిట పోలింగ్ జరిగిన తీరును బేరిజు వేసిన ఫలితాలు వైరల్ అవుతుండటంతో జాతీయ సంస్థలు, ప్రాధాన్యత వున్న ప్రాంతీయ సంస్థలు శనివారం సాయంత్రం వెల్లడించనున్న ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై అందరి దృష్టి పడింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 3 ఎంపీ, 14 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం- బిజెపి- జనసేన, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీల మధ్య హోరా హోరీగా జరిగిన ఎన్నికల పోలింగ్ మే 13న ముగిసింది. దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ చివరి దశ జూన్ 1వ తేదీ ముగియనుండటంతో ఎలక్షన్ కమీషన్ శనివారం సాయంత్రం 6.30 గంటలకు పైన ఎగ్జిట్ పోల్స్ ఫలితాల వెల్లడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మే 13వ తేదీ జరిగిన పోలింగ్‌లో పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి వెలుపలికి వచ్చిన ఓటరు నాడిని పలు సంస్థలు అంచనా వేశాయి. ఎలక్షన్ కమీషన్ ఎగ్జిట్ పోల్స్‌పై జూన్ 1వ తేదీ సాయంత్రం 6.30 గంటల వరకు నిషేధం విధించడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పోలింగ్ రోజున ఓటరు నాడిని అంచనా వేసిన పలు సంస్థలు శనివారం ఫలితాలను వెల్లడికి సిద్ధం అయ్యాయి. సోషల్ మీడియాలో ఇప్పటికే పలు సంస్థలు పోలింగ్ అంచనా పేరిట వెల్లడిస్తున్న ఫలితాల మేరకు రాష్ట్రంలో మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి కానుందని కొన్ని సంస్థలు, లేదు రాష్ట్రంలో ఈ సారి ఎన్డీఏ కూటమికి ప్రజలు పట్టం కట్టారని కొన్ని సంస్థలు ఫలితాలను వెల్లడిస్తూ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజల్లో అయోమయం సృష్టిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పోటీ చేసిన కుప్పం నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో ఆయన ఓటమి పాలు కానున్నారని కొన్ని సోషల్ మీడియాలో పలు సంస్థలు ఫలితాలను వైరల్ చేస్తుండటంతో తెలుగుదేశం శ్రేణుల్లో ఆయోమయం ఏర్పడింది. కుప్పం నుండి ఎట్టి పరిస్థితుల్లోను తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు విజయం సాధిస్తారని, మెజార్టీ సైతం గత ఎన్నికల్లో వచ్చిన మెజార్టీకి మించి వుంటుందని తెలుగుదేశం పార్టీ నాయకులు సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు నగరి నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన మంత్రి రోజాకు ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. ఇక్కడి నుండి ఎన్డీఓ కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన గాలి భానుప్రకాష్ విజయం సాధిస్తారని కొన్ని సోషల్ మీడియాలో ఫలితాలు ప్రసారం కావడంతో అక్కడి తెలుగుదేశం నాయకులు సంబరపడుతున్నారు. చిత్తూరు నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన ఎంసి విజయానందరెడ్డి, తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన గురజాల జగన్మోహన్‌నాయుడుల మధ్య పోటీ తీవ్రంగా వుందని సోషల్ మీడియాలో ఒక వార్త వైరల్ అవుతుండగా, వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి విజయం సాధిస్తారని, మరోవైపు తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన గురజాల జగన్మోహన్‌నాయుడుకు విజయం వరిస్తుందని అదే సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అలాగే జిడినెల్లూరు నుండి ఈ సారి ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన కృపాలక్ష్మికి విజయం వరిస్తుందని ప్రముఖ సంస్థ సోషల్ మీడియాలో ప్రసారం చేస్తుండగా ఇక్కడి నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన థామస్ విజయం తథ్యమని కొన్ని సంస్థలు సోషల్ మీడియాలో ప్రసారం చేస్తున్నాయి. అలాగే పూతలపట్టు నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ సునీల్‌కుమార్‌కు ఈ ఎన్నికల్లో ఢోకా లేదని విజయం ఆయన వైపే వుందంటూ ఓ సంస్థ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తుండగా ఇక్కడి నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ మురళీమోహన్‌కు విజయం వరిస్తుందని మరో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం అవుతుంది. అలాగే తిరుపతి నుండి పోటీ చేసిన వైకాపా అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి విజయం వరిస్తుందని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం అవుతుండగా ఇక్కడి నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన పులివర్తినాని విజయం తథ్యమని కొన్ని సోషల్ మీడియాల్లో ప్రచారం అవుతుంది. అలాగే తిరుపతి నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన భూమన అభినయ్‌రెడ్డి ఈ ఎన్నికల్లో విజయం తథ్యమని సోషల్ మీడియా వేదకగా ప్రచారం జరుగుతుండగా ఇక్కడ నుండి కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన ఆరణి శ్రీనివాసులు విజయం సాధిస్తారని కొన్ని సోషల్ మీడియాల్లో ప్రచారం జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం అందరి దృష్టి అధికారికంగా శనివారం సాయంత్రం 6.30 గంటలకు పైబడి విడుదల కానున్న జాతీయ, ప్రముఖ ప్రాంతీయ సంస్థల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై పడింది. జాతీయ, ప్రముఖ ప్రాంతీయ సంస్థలు వెల్లడి చేయనున్న ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో జూన్ 4వ తేదీన వెల్లడి కానున్న వాస్తవ ఫలితాలు ఇంచుమించు ఒకే తరహాలో వుంటాయని భావిస్తున్న ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు.

# కౌంటింగ్ ప్రక్రియలో పకడ్బందీగా విధులు

**రిటర్నింగ్ అధికారి అధితి సింగ్**



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి అధితి

తిరుపతి కార్పొరేషన్, మే 31 ప్రభాతవార్త : సార్వత్రిక ఎన్నికలు-2024 ప్రక్రియలో భాగంగా జూన్ 4వ తేదిన నిర్వహించే ఎన్నికల ఓట్ల లెక్కింపునకు విధులు కేటాయించబడిన సిబ్బంది అందరూ జాగ్రత్తగా విధులు నిర్వహించాలని తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అధితి సింగ్ అన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిబ్బందికి శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్ మాట్లాడుతూ జూన్ 4వ తేదిన జరిగే సార్వత్రిక ఎన్నికలు -2024 ఓట్ల లెక్కింపులో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా జరిగేందుకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తు న్నామని అన్నారు. వివిధ విధులు నిర్వహించేందుకు ప్రత్యేకంగా టీమ్లు ఏర్పాటు చేశామని అన్నారు. వారందరూ వారి విధులను నిబద్ధతతో నిర్వహించాలన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పార్లమెంటు, అసెంబ్లీకి సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవ్రుతుందని అన్నారు. విధులు కేటాయించబడిన వారందరూ ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రాంగణంలోకి వాహనాల అనుమతి ఉండదని కౌంటింగ్ విధులు కేటాయించిన అందరికీ మెయిన్ గేటు నుంచి కౌంటింగ్ సెంటర్ వరకు బస్సును ఏర్పాటు చేశామని అన్నారు. కౌంటింగ్‌లో పాల్గొనే ప్రతి ఒక్క సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లకి కూడా కచ్చితంగా విధులు కేటాయించిన సిబ్బందికి తాగునీరు, భోజన సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. ఫలితాలను ఎప్పటికప్పుడు పారదర్శకంగా తెలియజేయాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక భద్రతా దళాలు ఉంటాయని తెలిపారు. అందరూ పారదర్శకంగా, జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎన్నికల ట్రైనింగ్ ఆఫీసర్ చంద్రమౌళి, తహశీల్దార్ నారాయణ రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, ఆర్ఓ సేతుమాధవ్, ఈడిటి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న అభిషేకసేవలో...
# కేంద్రహోమ్ మంత్రి అమిత్‌షా



తిరుమల, మే 31ప్రభాతవార్తప్రతినిధి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సమయంలో కేంద్రహోమ్‌శాఖా మంత్రి అమిత్‌షా దంపతులు శుక్రవారం వేకువజామున శ్రీవారి అభిషేకసేవలో పాల్గొన్నారు. సతీమణి సోనాల్ షాతో కలసి ఆయన ఆలయ మహద్వారం మీదుగా ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతంపలికారు. దర్శనానంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## నర్సింగ్ పాఠశాల వాహన క్లీనర్...
# దేవస్థాన ఆడిట్‌శాఖపై దౌర్జన్యం!

**-ఏళ్ళ తరబడి సేవ చేస్తున్న వారు మౌనం...**
**-ప్రత్యేక ఉత్తర్వులు తెచ్చుకున్న వారు హంగామా!**
**-అన్నిశాఖల్లోనూ అక్రమ నియామకలే**

*ఆలయంలో ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు దర్శనాలు చేయించి, పదో పాతికో సంపాదించి దళారులుగా అవతారం ఎత్తి, ఆ తరువాత ఎవరో ఒకరి పలుకుబడి ఉపయోగించి రాష్ట్ర దేవాదాయశాఖను తమకు అనుకూలంగా మార్చుకుని, ఓ ఉత్తర్వు తెచ్చుకునే స్థాయికి ఎదగడం పరిపాటిగా మారింది. ఉత్తర్వులు తెచ్చుకునే వ్యక్తుల యొక్క విద్యార్హతలను, వారి చేస్తున్న పనులను దేవాదాయశాఖ పట్టించుకోదు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇటీవల కాలంలో ఇబ్బడిముబ్బడిగా కమీషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కాగితాలు చేతికి తీసుకున్న వారు ఇక తమకు తిరుగులేదని కాలర్ ఎగురేస్తుండగా, సుమారు యాభై సంవత్సరాల నుంచి ఆలయంలో శివయ్య పాదాల చెంత సేవలందిస్తున్న వారు మాకు శివయ్య ఎప్పుడు కరుణిస్తాడని ఎదురు చూస్తున్నారు. దేవాదాయ శాఖలో ముఖ్యంగా కమిషనర్ కార్యాలయ పరిస్థితి పలుకుబడికి, పైసలకు దాసోహంగా మారింది. ఇదే అదునుగా ఆలయంలో భక్తులకు దర్శనాలు చేస్తూ పబ్బం గుడుపుకునే వ్యక్తులు దేవాదాయశాఖ నుండి ఓ ఉత్తర్వు తెచ్చుకునే స్థాయికి ఎదగడం. బయట ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు దర్శనాలు చేయిస్తూ, వచ్చిన సంపాదనతో జీవితం ప్రారంభించే వ్యక్తులు, ఆ తరువాత ఆలయంలో రాజకీయ నాయకుల సిఫార్సులతో నిబంధనలకు పాతర వేసి నియామక ఉత్తర్వులు తెచ్చుకోవడం జరుగుతున్నది. దీనికి రాజకీయ నాయకుల అండదండలు ఎక్కువగా పనిచేస్తాయి. అయితే ఆడిట్ విభాగం వారిని తమకు ఆలయ ఖాతా నుండి జీతం ఇచ్చేలా సిపార్సు చేయమని ఒత్తిడి తేస్తారు. దీనిపై అభ్యంతరం చెప్పిన ఆడిట్‌శాఖ వారిపై దాడులు, దౌర్జన్యాలు చేయడం చోటు చేసుకుంటున్నాయి.*



శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అర్చకులు, పరిచారకులు సీనియర్ల కుటుంబాల వారితో నింపుకుంటుండగా, వేదపండితులు కూడా ఆదే వరసగా తమ బంధువులకు అవకాశం కల్పించుకుంటున్నారు. ఇక కార్యాలయంలో కొందరు పలుకుబడి కల్గిన వారి కుటుంబ సభ్యులను నియమించుకుంటున్నారు. ఇందుకు ఆలయంలో పని చేస్తూ పాలకుల సిఫార్సు ఉత్తర్వులతో దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి సునాయాసంగా అనుమతి పొందుతున్నా రనే ఆరోపణలు చోటు చేసుకున్నాయి. అయితే గురువారం నర్సింగ్ కళాశాల వాహనంలో క్లీనర్‌గా దేవాదాయశాఖ నుండి ఉత్తర్వులు తెచ్చేకుని తనకు జీతం సిఫారస్సు చేయాలని ఆడిట్‌శాఖపై దౌర్జన్యానికి దిగడం చర్చియాంశంగా మారింది. ఆ ఉద్యోగి గతంలో కూడా అధికారులపై తిరగబడి బయటకు పంపివేసిన సంఘటనలు న్నాయి. అయితే ఆయన ఎలాగోలాగ దేవాదాయశాఖ నుంచి ఓ కాగితం ముక్కను సంపాదించుకున్నారు. అది ఏమంటే క్లీనర్‌గా దేవస్థానానికి అనుబంధంగా నిర్వహిస్తున్న నర్సింగ్ పాఠశాల వాహనంలో పని చేయటానికి అనుమతి పొందారు. అతనికి సంబంధించిన బిల్లును 'ఆడిట్ విభాగం' పలు అభ్యంతరాలు పొందుపరుస్తూ తిరస్కరించారు. దాంతో ఆ చిరుద్యోగి రెచ్చిపోయి, ఆడిట్‌శాఖ అధికారులపై హల్ చల్ చేసారు. దాంతో ఆడిట్ విభాగం ఉద్యోగులు విధులను బహిష్కరించి బయటకు వచ్చారు. ఇలా అయితే విధులను నిర్వహించలేమంటూ నొచ్చుకున్నారు.

**ఆడిటర్ వివరణ:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి ఆడిట్ విభాగానికి చెందిన అధికారి రమణమూర్తిని వివరణ కోరగా ఆయన ఇలా తెలిపారు. గొడవ చేసిన ఉద్యోగి జ్ఞాన ప్రసూనాంబ నర్సింగ్ పాఠశాలలో వాహనం క్లీనర్‌గా అనుమతి తెచ్చుకున్నారు. అయితే ఆతను ఆలయంలో ఉంటూ కాలం గడుపుతున్నట్లు సమాచారం. ఆతనికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా అవకాశం వచ్చిందని కానీ బిల్లు పొందుపరచటంలో నిబంధనలను పాటించలేదన్నారు. ఇలాంటి వారు ఆరుగురు ఉన్నారని రమణమూర్తి వివరణ ఇచ్చారు. నిబంధనలను పాటించక ఆడిట్ శాఖపై దౌర్జన్యాలకు పాల్పడితే తాము విధులు ఎలా నిర్వహిస్తామని ప్రశ్నించారు.

**-సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి, మంత్రి పెద్దిరెడ్డిపై ఘాటు విమర్శలు**

## సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నా...
# డంపింగ్ యార్డు నుంచి ఇసుక అక్రమ రవాణా

**-గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డికి కమీషన్ -యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్ తరలింపు -ఉల్లంఘనపై చర్యలు ఏది?**

నారాయణవనం, మే 31 ప్రబాతవార్త : సత్యవేడు నియోజక వర్గంలో అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రమేయంతో సురుటుపల్లి డంపింగ్ యార్డు నుంచి ఇసుకను అక్రమంగా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

రవాణా చేసి కోట్ల రూపాయాలను దోచుకుంటున్నారని సత్యవేడు ఎమ్మెల్యే, ప్రస్తుత ఉమ్మడి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి కోనేటి ఆదిమూలం శుక్రవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మండిపడ్డారు. ఈ సందర భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలల క్రితమే సుప్రీంకోర్టు, ఎన్‌జిటి ఇచ్చిన తీర్పు మేరకు ఇసుకను తరలించకూడదని ఆదేశాలు ఇచ్చారు. అయితే మంత్రి అండదండలతో ప్రతి రోజు ఇసుకను టన్నుల కొద్ది అధిక ధరలు పెట్టి అమ్ముకుంటున్నట్లు విమర్శించారు. ప్రస్తుతం డంఫింగ్ యార్డులో ఒక ట్రాక్టర్ ఇసుకను రూ 3250లకు, అలాగే టిప్పర్లలో ఇసుకను రూ 20వేలకు అమ్మి వాటిని తమిళనాడు, కర్ణాటకకు తరలించి లక్షల రూపాయాలను సంపాదించుకోవడం జరుగుతోందన్నారు. గతంలో తిరుపతి కలెక్టర్ వెంకట రమణారెడికి, మైన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని, అలాగే ప్రస్తుతం ఎన్నికల నిబంధన వున్నప్పటికి ఖతారు చేయకుండా ప్రతి రోజు లక్షల రూపాయాల విలువ చేసే ఇసుకను తరలించి దోచుకుంటున్నట్టు చెప్పారు. ప్రస్తుతం నాగలాపురం తహశీల్దారు, విఆర్‌ఓకు ఫిర్యాదు చేశామని వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదని మండిపడ్డారు. అలాగే గ్రావెల్, కంకర కూడా ప్రతి రోజు వందల సంఖ్యలో తమిళనాడుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండదండలతో తరలించి దోచుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుత కలెక్టర్, మైన్స్, జిల్లా ఎస్పీ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రచ్చగొట్టె మాటలు మాట్లాడుతున్న సజ్జలపై కఠిన చర్యలు అవసరం :**

ప్రజలను రచ్చగొట్టె విధంగా ముఖ్యమంత్రి జగన్‌కి సలహాదారుడిగా పనిచేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడడం పట్ల సత్యవేడు ఎమ్మెల్యే, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి కోనేటి ఆదిమూలం మండిపడ్డారు. అసలు సజ్జల ఎవరు?ఆయన ఏమైనా ఎమ్మెల్యేనా?ఎంపినా?మంత్రినా లేదా సర్పంచ్ అని ప్రశ్నించారు. కేవలం ముఖ్యమంత్రి వద్ద జీతం కోసం పని చేస్తున్న సజ్జల ప్రజలను రచ్చగొట్టె విధంగా మాట్లాడడం ఎంత వరకు సమంజసమన్నారు. ఎన్నికల కోడ్ అమలులో వున్న తరుణంలో కౌటింగ్‌కు వెళ్ళే వాళ్ళు గొడవులకు కూడా సిద్ధంగా వుండే వాళ్ళే వెళ్ళాలని మెసేజ్ ఇవ్వడం భావ్యంకాదన్నారు. అలాంటి వ్యక్తిపై ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రశాంతమైన వాతావరణంలో...
# ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ

**- తిరుపతి జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు**

**-జిల్లాలో 3 వేల మంది బలగాలతో పటిష్టమైన భద్రత -సెక్షన్ 144 సిఆర్‌పిసితో పాటు సెక్షన్ 30 పోలీస్ యాక్టు**



సమావేవశంలో మాట్లాడున్న ఎస్పి హర్షవర్ధన్

తిరుపతి క్రైం, మే 31 ప్రభాతవవార్త : జూన్ 4వ తేది కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణ చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ అనుసరిస్తున్న ప్రణాళికను జిల్లా ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు స్థానిక పోలీసుల అతిథి గృహం నందు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ ఒక వైపు కౌంటింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగిస్తూ శాంతి భద్రతల పరిరక్షణ చేస్తూ మరోవైపు తిరుపతి తిరుమల యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేస్తూ, ప్రత్యేక ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ నో ఫ్లయింగ్ జోన్, రెడ్ జోన్‌గా ప్రకటించబడింది. అందువల్ల ఇక్కడ డ్రోన్ కెమెరాలు ఎగరవేయటం నిషిద్ధమన్నారు. ఎవరైనా ఎన్నికల నిబందనలు ఉల్లంగించి డ్రోన్ కెమెరాలు ఎగరవేస్తే అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కౌంటింగ్ జరుగుతున్న ప్రదేశం 3 కిలోమీటర్ల పరిధి వరకు అంతా పోలీసుల ఆధీనంలో ఉంటుందన్నారు. జిల్లాలో ఎవరైనా అల్లర్లు సృష్టించాలని ప్రయత్నిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలలో పోలీసు పికెట్లతో పాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా పెంచామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కొరకు జిల్లా వ్యాప్తంగా 73 మొబైల్ పార్టీలు 53 ఎస్కార్ట్ టీంలను మోహరింపు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలను ట్రబుల్ మాంగర్లును గుర్తించామని ఇప్పటికే 621 మందిని బైండోవర్ చేసామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆటోలకు మైక్లను అమర్చి కౌంటింగ్ సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే తీవ్రమైన చర్యలు తప్పవని ప్రజలకు హెచ్చరికలు చేసారు. చంద్రగిరి నియోజక వర్గంలో శాంతి భద్రతల పరిరక్షణకు ట్రైనీ ఐపీఎస్ దేవరాజ్ మనీష్ పాటిల్ ఆధ్వర్యంలో ఒక కంపెనీ కేంద్ర సాయుధ బలగాలతో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ చేయుటకు పోలీసు వారికి సహకరించాలని జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు విజ్ఞప్తి చేసారు. కౌంటింగ్ సందర్భంగా తిరుపతి నగరంలో శ్రీ వారి దర్శనార్థం వచ్చి వెళ్లే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తిరుపతి నగరంలో ముందస్తుగా ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ రోజు కోసం7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి, వాహనాలు, వ్యక్తుల సజావుగా వెళ్లేందుకు వీలుగా సమగ్ర ట్రాఫిక్ నిర్వహణ ప్రణాళికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డిఎస్పి స్థాయి వరకు పోలీసు సిబ్బంది, ఎంఆర్‌ఓ స్థాయి వరకు రెవెన్యూ అధికారుల వాహనాలు, కౌంటింగ్ ఏజజెంట్లు, పోలీస్ సిబ్బంది కూడా పొంగులేటి సీతమ్మ రోడ్ పార్కింగ్ ప్లేస్‌లో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఎస్పి సరిత, అదనపు ఎస్పిలు వెంకట్రావు పరిపాలన, కులశేఖర్ శాంతిభద్రతలు, విమలకుమారి నేర విభాగం, డిఎస్పిలు వెంకటాద్రి ఎస్బి, రమణ కుమార్ తిరుపతి ట్రాఫిక్, ట్రైనీ డిఎస్పి సింధు ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు రోజు చిత్తూరులో ట్రాఫిక్ ఆంక్షలు

– ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, మే 31 ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4వ తేదీ ఉదయం 4 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు చిత్తూరు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. చిత్తూరు ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించనుండటంతో చిత్తూరు నగర పరిసరాల్లో ఆ రోజు ట్రాఫిక్‌ను పూర్తిగా మళ్లించడానికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

– చిత్తూరు నుండి తిరుపతి, కడప, పీలేరు, హైదరాబాదు వైపు వెళ్ళాల్సిన వారు ఇరువారం వైపుగా వెళ్లి అక్కడి నుంచి వరిగపల్లి వద్ద వున్న కాఫీ డే చేరుకుని వరిగపల్లి జంక్షన్ నుండి కుడివైపు తిరిగి 6 లైన్ హైవే మీద వెళ్ళాల్సివుంటుంది.

– చెన్నై, వేలూరు నుండి చిత్తూరు మీదుగా తిరుపతి, కడప, పీలేరు, హైదరాబాదు వెళ్ళాల్సిన వారు రెడ్డిగుంట జంక్షన్ నుండి ఎడమవైపు తిరిగి వరిగపల్లి జంక్షన్ వద్ద కాఫీ డే చేరుకుని అక్కడి నుండి కుడి వైపు 6 లైన్ హైవే మీదుగా వెళ్లాలి.

– తిరుత్తణి నుండి చిత్తూరు మీదుగా తిరుపతి వెళ్ళాల్సిన వారు తాజా జంక్షన్ నుండి జీడినెల్లూరు పోలీస్ స్టేషన్ మీదుగా పుత్తూరు రోడ్డును వినియోగించుకుని తిరుపతికి వెళ్ళాల్సివుంటుంది. అలాగే తిరుపతి నుండి వేలూరు, చెన్నై, బెంగళూరుకు వెళ్ళాల్సిన వారు చిత్తూరు నగరం మీదుగా వెళ్లవచ్చును.

– కడప, పీలేరు, తిరుపతి నుండి చిత్తూరుకు రావాల్సిన వారు రంగంపేట 6 లైన్ హైవే పై ఓవర్ నుండి వరిగపల్లి జంక్షన్ కాఫీడే మీదుగా చిత్తూరుకు చేరుకోవాల్సివుంటుంది. అలాగే వావిల్‌తోట, బండపల్లి, పూతలపట్టు, ఇతర చిన్న గ్రామాల ప్రజలు చిత్తూరు రావాల్సివస్తే వారు వారికి సమీపంలోని 6 లైన్ హైవే పై ఓవర్ నుండి వరిగపల్లి జంక్షన్ కాఫీడే మీదుగా చిత్తూరుకు చేరుకోవాల్సివుంటుంది.

– తిరుపతి నుండి చిత్తూరుకు వచ్చే వారికి పెనుమూరు రోడ్డు పూర్తిగా నిషేధం.

– రంగంపేట పై ఓవర్ క్రాస్ నుండి మురకంబట్టు వరకు వాహనాల రాకపోకలు పూర్తి నిషేధం

– కౌంటింగ్ సిబ్బంది, అధికారులు, అభ్యర్థులు మాత్రమే ఎస్వీసెట్ వరకు అనుమతించబడుతారు.

– 2వ గేట్ ద్వారా ఆర్‌వీఎస్ హాస్పిటల్ వెనుక వైపు ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ అనుమతించబడుతుంది.

– ఏజెంట్లు, పోలీసులు, ప్రెస్ వారి వాహనాల కోసం మహర్షి పాఠశాల ఆవరణలో, ప్రక్కన ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేయబడింది. పూతలపట్టు నుండి వచ్చే వాహనం ఎడమవైపు సర్వీసు రోడ్డులో అండర్ పాస్ ద్వారా నేరుగా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవచ్చును.

– మురకంబట్టు వైపు నుండి వచ్చే వాహనాలు కుడి మలుపు తిరిగి ఆపై ఆర్‌వీఎస్ నర్సింగ్ కళాశాల హాస్టల్ వద్ద కుడి రహదారిపై నుండి మహర్షి పాఠశాల పార్కింగ్ స్థలం వైపు వెళ్ళవచ్చును.

## నీటి పరీక్షలు పూర్తి చేసిన తరువాతే పంపిణీ : కమిషనర్

పలమనేరు,మే 31 ప్రభాతవార్త:



పట్టణంలో ప్రజలకు మున్సిపాలటీ అందిస్తున్న నీటి పరీక్షల అనంతరమే సరఫరా చేయాలని మున్సిపల్ సిబ్బందికి మున్సిపల్ కమీషనర్ రమణా రెడ్డి సూచించారు. స్థానికంగా పట్టణంలో శుక్రవారం ఆయన పట్టణంలోని మున్సిపాలిటీ నీటి నిల్వ ట్యాంకులను పరిశీలించారు. ఈ మేరకు నిల్వ ఉన్న నీటిని ఆయన పరీక్షించారు. నీటి పరీక్షల అనంతరమే ప్రజలకు నీటిని సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పట్టణంలో జరిగే కూరగాయల సంతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటరీ సెక్రెటరీలు మార్కెట్‌లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, రెవెన్య ఇన్స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి!

వి.కోట,మే 31,ప్రభాతవార్త:

చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వి.కోట మండలం శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని దాసార్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు (48) ఉదయం చేపల వేటకు వెళ్లి చెరువులో ప్రమాదవశాత్తు జారి పడడం జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని స్థానికుల సహాయంతో శ్రీనివాసులు గుర్తించి వెలికి తీశారు. అప్పటికే శ్రీనివాసులు మృతి చెందినట్లు పోలీసులు గుర్తించి పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు ధర్యాప్తు చేస్తున్నారు.

## మైనర్ బాలికను మోసం చేసిన యువకుడికి రిమాండ్

చౌడేపల్లి, మే 31 ప్రభాతవార్త :

మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి ఆత్మహత్యకు ప్రేరేపించిన యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు...మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లికి చెందిన ఆనంద్(18) ఓ మైనర్(15)ను ప్రేమిస్తున్నానని నమ్మబలికాడు. అంతే కాకుండా పెళ్ళి చేసుకొంటానని ప్రమాణం చేసాడు. దీంతో బాలిక అతని మాటలు నమ్మింది. తీరా కులాలు వేరనీ, తన తల్లిదండ్రులు చూసిన సంబంధాన్ని చేసుకొంటానని బాలికతో ఆనంద్ చెప్పాడు. దీనితోపాటు తనను విడచిపెట్టి ఏమైనా చేసుకోమన్నాడు. దీంతో మనస్తాపానికి చెందిన మైనర్ బాలిక ఈనెల 15తన ఇంట్లోనే ఉరేసుకొంది. గుర్తించిన సోదరుడు ఉరికి వేలాడుతున్న బాలికను రక్షించి మదనపల్లి తర్వాత తిరుపతికి తరలించారు. అయితే ప్రస్తుతం బాలిక మానసిక పరిస్థితి దారుణంగా తయారైంది. బాలిక తండ్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామనీ, ఈమేరకు దాదేపల్లి బస్‌స్టాఫ్ వద్ద నిందితున్ని అరెస్టు చేసి చిత్తూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ వివరించారు.

## ఘనంగా ప్రపంచ పోగాకు వ్యతిరేక దినోత్సవం

సదుం, మే31 ప్రభాతవార్త:



సదుంలో శుక్రవారం ఘనంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. చెరకువారిపల్లె ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి గిరీషా ఆధ్వర్యంలో సదుం పట్టణంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పొగాకు వల్ల కలిగే నష్టాలను గురించి సదుం సంతలో ప్రచారం చేశారు. పొగాకు వాడకం వల్ల క్షయ వ్యాధి, ఊపిరితిత్తులు పాడవడం, క్యాన్సర్ వంటి వ్యాధులు కలుగుతాయని చెప్పారు. దాదాపు శరీరంలోని అన్ని అవయవాలు పొగాకు వాడకంవల్ల పాడవుతాయన్నారు. ప్రతి ఒక్కరు పొగాకు వాడకానికి దూరంగా ఉండి మెరుగైన జీవన విధానం అలవరచుకోవాలని సూచించారు. ముఖ్యంగా బహిరంగా ప్రదేశాలలో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, స్కూల్‌జోన్ పరిదిలో పొగాకువాడకం నేరమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త హేమలత, ఆశా కార్యకర్తలు అరుణ, రెడ్డికుమారి, శకుంతల, మాజీ సర్పంచి సయ్యద్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై జనుము జీలుగ విత్తనాలు

యర్రావారిపాలెం, మే31 ప్రభాతవార్త :

మండల పరిధిలోని రైతులకు 50 శాతం రాయితీపై జనుము, జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఖాదర్‌భాషా తెలిపారు. కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించి ఆధార్‌కార్డు, 1 బి, ఇచ్చి బయోమెట్రిక్ ద్వారా పొందాలన్నారు. పది కిలోల జనుము, జీలుగ విత్తనాలు రూ.440కి అందజేస్తున్నామన్నారు.

## జూన్ సామాజిక పెన్షన్లు డిబిటి బ్యాంకు అకౌంట్లకు జమ

– బ్యాంకు అకౌంట్లు లేని వారికి, 80 సంవత్సరాలు దాటిన వారికి ఇంటి వద్దకే పెన్షన్లు

– కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, మే 31 ప్రభాతవార్త:

సామాజిక పెన్షన్ లబ్ధిదారులకు జూన్ నెలకు సంబంధించి డిబిటి బ్యాంకు అకౌంట్లకు జమ చేయడం జరుగుతుందని కలెక్టర్ సగిలి షన్మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే బ్యాంకు అకౌంట్లు లేని లబ్ధిదారులు, 80 సంవత్సరాలు దాటిన వారికి సచివాలయ సిబ్బంది వారి ఇంటి వద్దకు వెళ్ళి పెన్షన్ మొత్తంను అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 2,27,223 మంది లబ్ధిదారులకు రూ.79.66 కోట్ల సామాజిక భద్రత పెన్షన్లు శనివారం నుండి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎండ తీవ్రత ఎక్కువగా వున్న నేపథ్యంలో వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు రానవసరం లేకుండా వారి సంక్షేమంను దృష్టిలో వుంచుకుని జూన్ నెలల పంపిణీ చేయాల్సిన సామాజిక పెన్షన్‌ను ఆధార్ లింక్డ్ బ్యాంకు అకౌంట్ వున్న లబ్దిదారులకు డిబిటి ద్వారా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 2,27,223 మంది లబ్దిదారులకు సామాజిక పెన్షన్లు పంపిణీ చేయాల్సివుండగా 1,88,059 మంది లబ్దిదారుల బ్యాంకు అకౌంట్లు ఆధార్ నెంబర్‌తో లింక్ అయి వున్నాయని, వీరికి డిబిటి ద్వారా శనివారం బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుందన్నారు. మిగిలిన 84,164 మంది లబ్దిదారులకు సైతం శనివారం సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షనర్ల ఇంటి వద్దకు వెళ్ళి నగదు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంను మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓల ఆధ్వర్యంలో ఆయా సచివాలయ సిబ్బంది ద్వారా చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే పెన్షన్ నగదు విత్‌డ్రా చేసుకోవడానికి బ్యాంకుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అర్ధగిరిలో ఘనంగా శ్రీహనుమజ్జయంతి వేడుకలు ప్రారంభం

తవణంపల్లె, మే 31 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామివారి దేవస్థానంలో శ్రీహనుమజ్జయంతి వేడుకలు శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ప్రతిఏటా ఆలయంలో శ్రీహనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయ ఈఓ టి.హనుమంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఈవేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈమేరకు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఆలయంలోని మండపంలో అర్చకులచే మంగళవారం 6 గంటలకు అనుజ్ఞ, విశ్వక్సేనారాధన, రుత్విక్‌వరణం, వాసుదేవ పుణ్యా వాచనం, రక్షాబంధనము అంకురార్పణ, కలశస్థాపన, నివేదన మంగళహారతి తదితర పూజాధి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## సిద్ది వినాయక గోంసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

కాణిపాకం, మే 31 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు శుక్రవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు చెన్నైకు చెందిన శ్రీనివాసన్ అనే భక్తుడు ఈపథకానికి 1,00,116 రూపాయలను విరాళం గా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుం బసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగలా అశ్వర్థవృక్షములకు కళ్యాణోత్సవం

చౌడేపల్లి, మే 31 ప్రభాతవార్త :



కళ్యాణము చూతము రారండంటూ రావివేపచెట్లకు నిర్వహించిన కళ్యాణోత్సవం చూపరులను మంత్ర ముగ్దులను చేసింది.,, మండలంలోని చారాల పంచాయతీ జంగాలపల్లి రవి నాలుగేళ్ళక్రితం గ్రామ నడిబొడ్డులో గల రావివేపచెట్లకు రచ్చబండ ఏర్పాటు చేసి నాగులరాళ్ళను ప్రతిష్టించాడు. అప్పటి నుంచి యేటా వాటికి వివాహం చేస్తూవస్తున్నాడు. వంశవృద్ధి, సంతాన ప్రాప్తితోపాటు లోకం సుభిక్షంగా వుండాలనే వుద్దేశ్యంతోనే ప్రకృతికి సాక్షాలుగా నిలచిన చెట్లకు పెళ్ళి చేస్తున్నట్లు నిర్వాహకుడు రవి తెలిపాడు. తన కుటుంబ సభ్యులు, సోదరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కళ్యాణోత్సవంలో వేదపండితుడు స్థానీకం ఆనందాచార్యులచే శాస్త్రోక్తంగా మాంగళ్యధారణ చేయించారు. నాగదేవతలకు పంచామృతాభిషేకం, అర్చన, అశ్వర్థ వృక్షములకు కళ్యాణోత్సవం జరిగింది. రవి ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతిలాంటి కార్యక్రమాలు జరిగాయి. గ్రామంతోపాటు చుట్టుపక్కలవారు వివాహ మహోత్సవానికి హాజరయ్యారు.

## రాహుకాలాభిషేకానికి విశేష స్పందన

బోయకొండ(చౌడేపల్లి), మే 3 ప్రభాతవార్త :



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహించిన రాహుకాలాభిషేకానికి దంపతుల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగా వించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళి, అధికారులు, అర్చక, సిబ్బంది భక్తులకు వసతులు సమకూర్చారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎగ్జిట్ పోల్ సర్వేలపై నేతల చూపు...నేడు సర్వేల వెల్లడి

వెంకటగిరి టౌన్, మే 31 ప్రభాతవార్త :

ఈ నెల 13వ తేది జరిగిన పోలింగ్‌లో ఓటర్ల నాడి ఏ విధంగా ఉందో జూన్ నెల ఒకటో తేది సాయంత్రం 6.30 గంటలకు ఎగ్జిట్ పోల్ సర్వేలను వెల్లడించనున్నారు. సర్వేల కోసం ప్రధాన పార్టీల నాయకులు ఎదురు చూస్తున్నారు. జూన్ నెల ఒకటవ తేది సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఘట్టం సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. పోలింగ్ ఘట్టం ముగిసిన అనంతరం ఎగ్జిట్ పోల్ సర్వేలను విడుదల చేసుకోవచ్చని చీఫ్ ఎలక్షన్ కమిషన్ ప్రకటించి ఉంది. ఎగ్జిట్ పోల్ సర్వేలు ఎప్పుడు వస్తాయని వస్తే ఏ విధంగా ఉంటాయో అని ప్రధాన పార్టీల వారు ఉత్కంఠ భరితంగా ఎదురుచూస్తున్నారు. ప్రధాని పార్టీల వారు ఇప్పటికే గెలుపు తమదేనంటూ ధీమాగా ఉన్నారు. గెలుపు తమదంటే తమదైన అంటూ ప్రకటించుకుంటున్నారు. 18 రోజుల తర్వాత ఎగ్జిట్ పోల్ సర్వేలను విడుదల చేయనున్నారు. జూన్ నెల ఒకటో తేది విడుదల చేసే ఎగ్జిట్ పోల్ ఏ విధంగా ఉంటుందో వేసి చూడాల్సిందే.

## కానరాని వర్షాలు...తాగునీటి కోసం మూగజీవాల రోధన

వెంకటగిరి టౌన్, మే 31 ప్రభాతవార్త :



వర్షాలు కానరాకపోవడం వల్ల కరువుతో గ్రామాలు వెలవెల పోతున్నాయి. పశువులకు తాగు నీరు మేత లేక అల్లాడుతున్నాయి. మే నెలలో ఎండలు మండలుతుండడం వల్ల చెరువులో గుంటల్లో ఉన్న నీరు పూర్తిగా ఎండిపోవడంతో పశువులకు తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నాయి. పశువులను మేతకు తీసుకెళ్లినప్పుడు అందుబాటులో నీరు లేకపోవడం వల్ల దాహంతో అల్లాడుతున్నట్లు పశువుల యజమానులు వాపోతున్నారు. బోర్లు బావుల్లో నీరు అడుగెండడంతో పంటను కాపాడుకోలేక పోతున్నట్లు రైతులు వాపోయారు. వర్షాలు ఎప్పుడు పడతాయి అని ఎదురుచూస్తున్నారు.

## రైల్వే గేటు వద్ద వాహనదారుల అవస్థలు

వెంకటగిరి టౌన్, మే 31 ప్రభాతవార్త :



రైల్వేస్టేషన్ వద్దన్ను గేటు వలన వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు గూడ్స్‌లు వచ్చినప్పుడు గేటుపడుతున్నాడడంతో ఇబ్బంది పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. వెంకటగిరి నుండి నాయుడుపేటకు వెళ్లే మార్గంలో రైల్వే స్టేషన్ వద్ద గేటును ఏర్పాటు చేశారు. నిత్యం రైలు గూడ్స్‌లు ఈ మార్గాల్లో ఎక్కువగా ఉన్నందువల్ల ప్రతి 15 నిమిషాలకు గేటు పడుతున్నట్లు వాహనదారులు తెలిపారు. విద్యార్థులు కూడా రైల్వే గేటు వల్ల ఇబ్బంది పడుతున్నారు. అంబులెన్స్ అత్యవసరంగా వెళ్లాలన్న గేటుతో అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. నిత్యం రైల్వే గేట్ వల్ల ఇబ్బంది పడుతున్నట్లు ప్రయాణికులు వాపోయారు. ఫ్లై ఒవర్ వంచన నిర్వించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు.

## హోమియో ఫార్మసిస్ట్‌కు ఘనంగా వీడ్కోలు

గూడూరు, మే 31 ప్రభాతవార్త :



గూడూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన రాఘవరెడ్డిని ఘనంగా సన్మానించారు. శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో వైద్యులు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ విధుల్లో అంకిత భావంతో పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ నాన్సీగ్రేస్, వైద్యులు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ లహరి, డాక్టర్ మధుసూధన్ రావు, డాక్టర్ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## గాడ్ గ్రేస్ వృద్ధాశ్రమంలో అన్నదానం

గూడూరు, మే 31 ప్రభాతవార్త :



గూడూరు రెండవ పట్టణ పరిధిలోని అడివయ్యకాలనీలో గల గాడ్ గ్రేస్ సొసైటీ వృద్ధాశ్రమంలో శుక్రవారం శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా దృక్పధాన్ని అలవరచుకోవాలన్నారు. యువత సేవా కార్యక్రమాలు వైపు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూరపాటి రవీంద్ర బాబు, ఆశ్రమ నిర్వాహకులు భాషాజాన్ పాల్, తదితరులు పాల్గొన్నారు.

## పూడి వద్ద తమిళనాడువాసి ఆత్మహత్య!

తడ, మే 31 ప్రభాతవార్త :



కుటుంబ కలహాల కారణంగా తడ మండలం పూడి వద్ద తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు, జాతీయ రహదారి పక్కన ఒక ఆటో ఎలక్ట్రికల్ వర్క్ షాపులో గత మూడురోజులుగా తమిళనాడుకు చెందిన గణేష్ (21) పనిచేస్తున్నాడు. చెన్నై సమీపంలోని మన్నాడి ప్రాంతానికి చెందిన గణేష్‌కు ఏడాది క్రితమే వివాహం జరిగింది. భార్యతో తరచూ గొడవలు జరిగేవి. ఇటీవల ఆమె పుట్టింటికి వెళ్లిపోయినట్లు సమాచారం. పనుల కోసం ఆంధ్రా ప్రాంతానికి వచ్చి మూడురోజుల క్రితమే ఇక్కడ చేరిన గణేష్ రాత్రి అదే షాపులో పడుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంబంధిత షాపు పైభాగాన ఉన్న ఇనుప రాడ్డుకు ఉరేసుకొని ఇతను మృతిచెంది ఉండగా, పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసులు శవాన్ని స్వాధీనం చేసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చట్టాలపై గిరిజనులకు అవగాహన

కోట, మే 31 ప్రభాతవార్త :



భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు, చట్టాలపై గిరిజనులు అవగాహన కలిగి ఉండాలని గూడూరు డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కోట మండలం చిట్టేడు గ్రామంలో గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లలను కూలీ పనులకు పంపకుండా పాఠశాలలకు పంపించాలన్నారు. గిరిజనులకు రిజర్వేషన్లు ఉన్నాయని, బాగా చదివించుకుంటే ఉన్నతమైన ఉద్యోగాలు వస్తాయన్నారు. మీకు ఏ కష్టం వచ్చినా తనకు నేరుగా ఫోన్ ద్వారా సమాచారం తెలియజేయాలని కోరారు. మీకు అండగా ఉంటామని గిరిజనులకు భరోసా కల్పించారు. ఆయన వెంట సీఐ హరికృష్ణ, ఎస్ఐ నాగబాబు తదితరులు ఉన్నారు.

## కేంద్ర హోంమంత్రిని కలిసిన కోట బిజెపి నాయకులు

కోట, మే 31 ప్రభాతవార్త :



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో కోట బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, జిల్లా బిజెపి నాయకులు దువ్వూరు గిరిధర్‌రెడ్డి కలిశారు.

## సూళ్లూరుపేటలో హనుమజ్జయంతి వేడుకలు

సూళ్లూరుపేట, మే 31 ప్రభాతవార్త :

సూళ్లూరుపేటలోని శ్రీబాలాంజనేయ స్వామి దేవస్థానంలో 1వ తేదీ శనివారం నుంచి 5వ తేదీ బుధవారం వరకు శ్రీబాలాంజనేయస్వామివారికి హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ప్రధాన అర్చకులు దివి లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. 1వ తేదీన శనివారం ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు బాలాంజనేయ స్వామివారికి లక్ష తమలపాకులతో అర్చన జరుగుతుందన్నారు. అలాగే మిగతా ఐదు రోజులు స్వామివారికి ప్రత్యేక అలంకారాలు, అభిషేకాలు, పూజలు జరుగుతాయని చెప్పారు. భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్య నిర్వహణ అధికారి కె.మమత పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

## టిడిపి కార్యకర్తకు బీద పరామర్శ

సూళ్లూరుపేట, మే 31 ప్రభాతవార్త:



సూళ్లూరుపేట పట్టణంలో గత సంవత్సరం జరిగిన ఘర్షణల్లో తీవ్రంగా గాయపడిన టిడిపి కార్యకర్త వెంకటేష్ యాదవ్‌ను శుక్రవారం నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్ పరామర్శించారు. గత సంవత్సరం జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడి తలకు బలమైన గాయం కావడంతో చికిత్స పొందిన అనంతరం తిరిగి గురువారం రోజు వెంకటేష్ యాదవ్‌కు సర్జరీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో వెంకటేష్ యాదవ్‌కు భరోసా ఇస్తూ బీద రవిచంద్ర ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులుఆకుతోటరమేష్, మేడాసాయినారాయణ, ఆలీభాయ్, శ్రీధర్, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

గూడూరు, మే 31 ప్రభాతవార్త:



గూడూరు మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాలకు 310 క్వింటాళ్ల జీలగ, 156 క్వింటాళ్ల పిల్లి పెసర, 60 క్వింటాళ్ల జనుములు వచ్చి ఉన్నాయని, కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో బయోమెట్రిక్ ద్వారా మీ రైతు భరోసా కేంద్రాలలో ఈ పచ్చి రొట్ట విత్తనాలను పొందవచ్చునని గూడూరు మండల వ్యవసాయాధికారి వి. రమేష్ ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ 50 శాతం రాయితీపై ఈ విత్తనాలను సరఫరా చేస్తుందని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మాజీ ఎంపిటిసికి ప్రముఖుల పరామర్శ

కోట, మే 31 ప్రభాతవార్త :

కోట మండలం చెందోడు గ్రామ మాజీ ఎంపిటిసి బాలసుబ్రహ్మణ్యం ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడ్డారు. ఆ మేరకు ఆయన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను పరామర్శించేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులే కాకుండా వైసీపీ, బిజెపి నాయకులు వచ్చారు. రోడ్డు ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## మోడల్ కాలనీలో పోలీసులచే కార్డెన్ సెర్చ్

కుప్పం, మే 31 ప్రభాతవార్త :



మున్సిపల్ పరిధి మోడల్ కాలనీలో శుక్రవారం వేకువజామున అర్బన్ సిఐ రమణ, ఎస్సై సుబ్బారెడ్డిలు సిబ్బందితో కలసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎలాంటి రికార్డులు లేని పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా సిఐ రమణ మాట్లాడుతూ అనుమానితులు ఎవరైనా ఈ ప్రాంతాల్లో సంచరిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. గొడవలు, తగాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 144 సెక్షన్‌తో పాటు ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించకుండా ప్రజలు, ఆయా పార్టీల కార్యకర్తలు సహకరించాలన్నారు. గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

## నేడు హనుమజ్జయంతి పూజలు

చిత్తూరు, మే 31 ప్రభాతవార్త:

చిత్తూరు–పెనుమూరు జాతీయ రహదారిలో వున్న వాగ్దేవి సవితా సేవాశ్రమంతో వైశాఖ బహుళ దశమి పురస్కరించుకుని శనివారం హనుమజ్జయంతి పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులు సహస్రనామార్చనలతో నాగవల్లి(తమలపాకుల దళము)లను సమర్పించనున్నారు. నాగవల్లి మాల, వడమాల సేవలతో పాటు క్షేత్ర పాలకునికి షోడశోపచార పూజలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ అధినేత స్వామిని పూజానంద ప్రధాన కార్యదర్శి హరగోపాల్ తెలిపారు. ఈ కారక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై హనుమంతుని కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## కలలకు పుట్టినిల్లు భారతదేశం

రేణిగుంట, మే 31 ప్రభాతవార్త:



సర్వ కలలకు పుట్టినిల్లు భారతదేశమని రాజ్ ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్ట ఇందిరానగర్ రాస్ ప్రాజెక్టు కార్యాలయంలో చైల్డ్ ఫండ్ ఇండియా ఆర్థిక సహాయంతో శుక్రవారం సాంస్కృతి కార్యక్రమాల పోటీలు జరిగాయి. ప్రాజెక్టు దత్తత గ్రామాల పిల్లలు సాంస్కృతిక కళలు ఉట్టిపడే వేషధారణలో పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న కలలకు జీవం పోయాలని రేపటి పౌరులకు పిలుపునిచ్చారు. న్యాయ వ్యవహరించిన భారత కళాక్షేత్రం శ్రీనివాస్ గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కరకంబాడి సర్పంచ్ ఈశ్వరమ్మ, మహిళా పోలీసు గౌతమి, రాస్‌కో-ఆర్డినేటర్ భారతి, విద్యార్థులు, తల్లిదండ్రులు, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్షయ క్షేత్రంలో అన్నదానం

రేణిగుంట, మే 31 ప్రభాతవార్త:



రేణిగుంట తెలుగు యువత నాయకులు ఎంజీ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. రేణిగుంట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఎంజీరెడ్డి మిత్ర బృందం, ఎంజీ యువసేన సభ్యులు వివిధ ప్రాంతాల్లో కేక్ కట్ చేసి అందరికి పంచడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేశారు. స్థానిక విమానాశ్రయ సమీపంలోని అక్షయ క్షేత్రంలో మానసిక వికలాంగుల మధ్య కేక్ కట్ చేసి వారికి తినిపించారు. కార్యక్రమంలో పవన్, ముత్తు, కార్తీక్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కాళభైరవ స్వామికి పుష్పాలంకరణ

నగరి, మే 31 ప్రభాతవార్త:

నగరి పట్టణంలో వెలసి ఉన్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో స్వామివారికి బహులాష్టమి పర్వదినాన నేడు ప్రత్యేక అభిషేక అర్చనలు జరిగాయి. మండు ఎండ టైనను లెక్క చేయక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి జరుగు విశేష అభిషేకం పాలు, పెరుగు, పంచామృతం విభూది పన్నీరు కొబ్బరి బోండా నీటితో విశేషంగా అభిషేకాలు జరిగాయి. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు వివిధ రకాలైన ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహన కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా విభూది, పుష్పం, పండ్లు, ప్రసాదాలు పంపిణీ చేశారు.

## వైభవంగా కలశ పూజలు

**నగరి, మే 31 ప్రభాతవార్త:** మండలంలోని బుగ్గ అగ్రహారం శ్రీ వన్నూరమ్మ ఆలయంలో చండీసప్తశతి హోమ పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అలంకరణలు భక్తులను ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హోమ పూజలు వీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ పూజలను బ్రహ్మశ్రీ తిప్పావఝ్ఝల శ్రీకాంత్‌శర్మ, నిభణపూడి ఉదయకుమార్ శర్మ, పురాణం దుర్గాప్రసాద్ శర్మ, నవీన్ కుమార్‌శర్మ, మహేష్ శర్మలు నిర్వహించగా ఆలయ ధర్మకర్త పూజారి వెంకటరెడ్డి పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టారు.

## చెట్లను నాటిన సేవ్ అక్సిజన్ ఫౌండేషన్



**ఏర్పేడు, మే31, ప్రభాతవార్త;** మొక్కలకు ప్రాణం పోసి బావి తరాలకు ప్రకృతిని కానుకగా ఇస్తామని సేవ్ అక్సిజన్ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు కేశవులు పేర్కొన్నారు. సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం కొత్తకాల్వ గ్రామం నుంచి పాపానాయుడుపేట గ్రామం వరకు నూతనంగా నిర్మించిన రోడ్డుకు ఇరువైపులా చెట్లను నాటడం జరిగింది. ఈసందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు మాట్లాడుతూ సంస్థ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రకృతిని పెంపొందించడానికి 6000వేల మొక్కలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు రామనాధరెడ్డి, లోకేష్, సంస్థ సభ్యులు నరేంద్ర, మౌళి, రాజు, చాన్ భాషా, మణి, వినయ్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చిన సర్పంచ్

ఏర్పేడు, మే31 ప్రభాతవార్త;



మండలంలోని ఎండీ పుత్తూరు దళితవాడలోని త్రాగు నీటిని అందిస్తున్న రెండు బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ప్రజలు తాగు నీటి కోసం అవస్థలు పడుతున్న హరిజనవాడ ప్రజల దాహార్తిని గమనించిన సర్పంచి మోహనప్రియ వెంటనే స్పందించి అవసరమైన వస్తువులను కొనుగోలు చేసి మెకానిక్‌లతో రెండు బోర్లకు మరమ్మతు పనులు చేయించి తాగు నీరు అందేలా చర్యలు తీసుకున్నారు. ఈసందర్భంగా హరిజనవాడ ప్రజలు సర్పంచికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈకార్యక్రమంలో హరిజనవాడ ప్రజలు పాల్గొన్నారు.

## టిడిపి రాష్ట్ర అధికారప్రతినిధికి సన్మానం

ఏర్పడు, మే31 ప్రభాతవార్త;



మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన టిడిపి బిసి రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డిని ఇటీవల రాష్ట్ర అదిష్టానం రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధిగా నియమితులైన సందర్భంగా వారి స్వగృహంలో శుక్రవారం మండలంలోని మునగలపాలెం గ్రామానికి చెందిన మాజీ డిసిసిబి చైర్మెన్ మోహన్‌రావు, మాజీసర్పంచి వేణుగోపాల్‌నాయుడు, పార్టీ బిసి నాయకులు వెంకటమునిరెడ్డి, తదితరులు కలసి దుశ్శాలువలు కప్పి పూల మాలలతో ఘనంగా సత్కరించి ఆశ్శీసులు అందజేశారు.

## శ్రీవారి సేవలో ఎంఎల్‌సి డాక్టర్ సుబ్రమణ్యం



**తిరుమల,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సర్వదర్శనానికి 30గంటలు



**తిరుమల,మే 31 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవులు ... వారాంతంతో శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తిరుమలకు చేరుకుంటు న్నారు. శుక్రవారం ఉదయానికి కొండ భక్తజనంతో కిటకిటలాడుతోంది. ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నానికి పెరిగిన భక్తులతో 30గంటలు సమయం దర్శనానికి నిరీక్షించాల్సిన పరిస్థితి.

## ఆలయంలో ఆచార వ్యహారాలకు తిలోదకాలు

శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో పరిపాలన తీరు ఓ విధంగా ఉంటే ఆచార వ్యవహారాలకు తిలోదకాలిస్తున్నారు. ఇక్కడి ఆచార వ్యవహారాలకు సంబంధించి దిశ దెశ నిర్దేశం చేయాల్సిన అర్చకులు, వేదపండితులు పెదవి విప్పటం లేదు. ఈ నేపథ్యంలో మహాశివరాత్రి సందర్భంగా తాత్కాలికంగా భక్తుల సౌకర్యార్థం మోక్ష గోపురం వైపు పురాతన కాలం నాటి రాతి మెట్ల మీద నుంచి భక్తులు ఎక్కలేరని భావించిన అధికారులు,పాలకులు మరి కాంట్రాక్టర్ల కోసమో ఏమో తాత్కాలికంగా చెక్క మెట్లు ఏర్పాటు చేసారు. అప్పుడే సంప్రదాయాలకు తిలోదకాలిస్తున్నారని విమర్శిస్తే అధికారులు, పాలకులు సమర్థించుకున్నారు. తీరా శివరాత్రి పూర్తి అయితే రెండు నెలలు గడుస్తున్నా వాటి తొలగింపును పట్టించుకోవటం లేదు. అయితే ఇక్కడి సంప్రదాయాలకు సంబంధించి వివరించాల్సిన అర్చకులు మనకెందుకులే అని మౌనం వహిస్తున్నారు.

## శాంతి,సంతోషాలకు ప్రవక్త విధానాలు ఆచరించాలి



**శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త :** నేడు సమాజంలో ఎంత సంపాదించిన వారైనా సుఖ సంతోషాల్లేక తల్లడిల్లుతున్నారని సమస్యల వలయంలో చిక్కి సతమత మౌతున్నారని అయితే తాము ఎంత సంపాదించినా ఇలా ఎందుకు జరుగుతుందని తల్లడిల్లుతున్నారని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియామస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన ధార్మికోపన్యాసంలో మనకు సకల సౌభాగ్యాలను ఇచ్చిన భగంతుని ఆరాధనలో వెనుక బడుతున్నామన్నారు. అల్లాహ్ మానవుని తన ఆరాధన కోసం పుట్టించి సకల సుఖాలనుఅందిస్తే ప్రపంచంలోని అన్ని వెసులుబాట్లును అనుభవిస్తూ మానవ జీవిత పరమార్థాన్ని ఆచరించటంను మరచి పోతున్నామన్నారు. మహమ్మద్ ప్రవక్త నిరాడంబర జీవితాన్ని అనుభవించారన్నారు.ఆయన జీవితాన్ని మనం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దైవమార్గం, దైవ చింతనతోనే మనం సుఖంగా ఉండగలమని గుర్తించాలన్నారు.

## సత్యవేడులో రాజేష్ విజయం తథ్యం

కేవీబీ పురం, మే 31 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలం కలత్తూరు గ్రామం ఆంధ్రప్రదేశ్‌లో జగన్ సీఎంగా నూకతోటి రాజేష్‌ఎమ్మెల్యేగా వైసీపీ పార్టీ 130 స్థీలతో అధికారంలోకి రావడం ఖాయమని కేవీబీ పురం మండల సీనియర్ వైసీపీ నేత తెన్నంబేడు ఆరువేలు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 9 తేదీ వైజాగ్‌లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని, అదే విధంగా సత్యవేడు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ విజయఢంకా మోగించడం ఖాయమని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందని కుటుంబం రాష్ట్రంలో లేదని ఆయన తెలిపారు. రాష్ట్ర విద్యుత్ భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉమ్మడి జిల్లాలో వచ్చే ఫలితాల్లో తన సత్తా చాటుతారన్నారు.పని చేసే ప్రభుత్వానికి ప్రజలు పట్టం కడతారని ఆయన తెలిపారు.

## తాగునీటి ట్యాంకును శుభ్రం చేసిన అధికారులు

కేవీబీ పురం, మే 31 ప్రభాతవార్త:

మండలంలోని వేమలపూడి గ్రామంలో తాగునీటి ట్యాంకు చుట్టూ బురద నీరు నిల్వ చేరి దుర్గంధాన్ని వెదజల్లుతూ తాగునీటి ట్యాంకును అల్లుకుని ఉన్న పిచ్చి మొక్కలను అధికారులు తొలగించారు. ముసురుకున్న పారిశుధ్యం ఉండడంతో ఆ గ్రామ ప్రజలు వాపోయారు. అధికారులు ఈ విషయం తెలియడంతో నిల్వ చేరిన బురద నీరును తొలగించారు. తాగునీటి ట్యాంకుపై అల్లుకున్న పిచ్చి మొక్కలు తొలగించి బ్లీచింగ్ పౌడర్‌తో ట్యాంకు శుభ్రపరచి సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించారు. ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్య పరిష్కారం కావడంతో గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో

-విధులకు సక్రమంగా హాజరు కాకపోతే కఠిన చర్యలు

-సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలి

కేవీబీ పురం, మే 31 ప్రభాతవార్త:

గ్రామసచివాలయ వ్యవస్థలో పని చేసే సిబ్బంది (ఉద్యోగులు) విధులకు సక్రమంగా హాజరు కాకపోయినా విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని కేవీబీ పురం మండల ఎంపీడీవో రెడ్డెయ్య ఆదేశించారు. మండలంలోని కండ్లురు, గుంటిపేడు, ఎంప రాజుల కండ్రిగ, సచివాలయాలను ఎంపీడీవో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సచివాలయం సిబ్బంది బయోమెట్రిక్‌లో సమయపాలన పాటించడం లేదని సమాచారం ఉన్న నేపథ్యంలో సమయపాలన పాటించని సిబ్బందికి మెమో ఇవ్వాలని జీవో ఉన్న నేపథ్యంలో ఎంపీడీవో కేవీబీ పురం మండలంలో 19 సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే విధంగా సిబ్బంది తీరును పరిశీలిస్తున్నారు. రికార్డులు పరిశీలించి సిస్టంను సైతం పరిశీలించారు. సచివాలయ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎలెక్షన్‌కోడ్ జూన్ 6 తేదీ వరకు ఉన్న నేపథ్యంలో విధుల్లో జాగ్రత్తలు కలిగి ఉండాలని ప్రభుత్వ నియామ నిబంధనలు పాటించి విధుల్లో జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు.

## ఊత్తుకోట వరకు శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో బస్సులు నడపాలి

కేవీబీ పురం, మే 31 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలం కేంద్రం మీదుగా వయా శ్రీకాళహస్తి-సురుటుపల్లి శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయం ఊత్తుకోట వరకు నెల్లూరు ఏపీఎస్ ఆర్టీసీ డిపో నుంచి రెండు బస్సులను ఏర్పాటుచేయాలని కేవీబీ పురం మండల ప్రజలు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరిని జరిగిన సమావేశంలో డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు మాట్లాడుతూ నెల్లూరుకు ఎంతో మంది ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ప్రజలు ఆరోగ్య వైద్య మెరుగైన సేవలు పొందేందుకు బస్సు సౌకర్యం అవసరమని తెలిపారు. సింహపురి ఆర్టీసీ నెల్లూరు రీజియన్ ఆ నాడు ఇది ఆ స్థానంలో మనుమ సిద్ధి ఆ స్థానంలో నాగలాపురం ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయులు తల్లి మీద నాగమాంబ పేరుతో ప్రముఖ శ్రీ వేద నారాయణస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి, ఆలయ నిర్మాణం చేపట్టబడింది. అటువంటి ప్రదేశమైన సురుటుపల్లి శివ ఆలయం మీదుగా ఆర్టీసీ బస్సులను ప్రారంభించాలని పలువురు మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపైన మన ప్రాంత వాసి మిద్దెల హరి ఆర్టీసీ వైస్ ప్రెసిడెంట్ కావడం అదరికి శుభపరిమాణమని, దీనిపైన త్వరలో చొరవ చూపి రెండు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని మండల నాయకులు ప్రజలు ఆయన్ని కోరారు. అదే విధంగా శ్రీకాళహస్తి ఏపీఎస్ ఆర్టీసీ డిపోలోకి బస్సులు లోపలికి వెళ్లే వద్ద శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం దక్షిణ కైలాసగా పేరుంది కనుక డిపోకు పెద్ద ఆర్చిని ఆ శ్రీకాళహస్తి జ్ఞానప్రసానాంభిక అమ్మవారి సిల్పాలతో శ్రీకాళహస్తి అనే పేరుతో ఆర్టీసీ ఏర్పాటు చేసి డిపో పేరు శ్రీకాళహస్తి రాయాలని , నెల్లూరు నుంచి వెళ్లే తిరుపతికి ప్రతి ఆర్టీసీ బస్సు శ్రీకాళహస్తి డిపోకు వచ్చి వెళ్లాలని పలువురు డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మన భవిష్యత్తుకు ఉద్యానవన పంటలే కీలకం :డిహెచ్‌ఓ

చంద్రగిరి, మే 31 ప్రభాతవార్త:



మన భవిష్యత్తు ఉద్యానవన, వ్యవసాయ పంటలపైనే ఆధారపడి వుంటుందని డిహెచ్‌ఓ దశరధరామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని శానంబట్ల పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం తిరుపతికి చెందిన చినీ నిమ్మ పరిశోధనా కేంద్రం, అనంతరాజుపేట ఉద్యానవన కళాశాల విదార్థినుల సంయుక్త ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యానవన ప ంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యశోద శంకర్, డాక్టర్ ఆర్.నాగరాజు, శాస్త్రవేత్తలు డాక్టర్ కవిత, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, చంద్రగిరి హెచ్‌ఓ శైలజ, అధ్యాపకులు జయప్రద, డాక్టర్ రమ్యలక్ష్మి, రాజేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

రామచంద్రాపురం, మే 31 ప్రభాతవార్త:



వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సికెఎస్ తేజ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీషా రావు మాదిరాజు జ్యోతి ప్రజ్వలన గావించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొగాకు వినియోగం, దూమపానం వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు. యువత పొగాకు, మత్తు పధార్థాలకు దూరంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాడెంట్ యం.సుమలత, ప్రిన్సిపాల్ డాక్టర్ యం. నిరంజన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బకు వృద్ధురాలు మృతి!

చంద్రగిరి, మే 31 ప్రభాతవార్త:



రెండు రోజులుగా భానుడి భగభగలను భరించలేని వృద్ధురాలు వడదెబ్బకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన రాగూరు పద్మావతమ్మ (85) గురువారం ఎండవేడిమికి తట్టుకోలేక తీవ్ర అస్వస్థకు గురై తుదిశ్వాస విడిచారని కుమారుడు రాగూరు చంద్రశేఖర్ ఆవేదన చెందారు. శుక్రవారం ఉదయం కుటగుంబ సభ్యులు, బంధు మిత్ర, గ్రామస్థుల అశ్రునయనాల నడుమ పద్మావతమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టుగా సుధీర్ఘ కాలం కొనసాగుతున్న రాగూరి చంద్రశేఖర్‌ను పలువురు పరామర్శించి, తమ విచారం వ్యక్తం చేశారు.

## నేడు వానర వనంలో హనుమాన్ జయంతి వేడుకలు

రామచంద్రాపురం, మే 31 ప్రభాతవార్త:



నెత్తకుప్పం సమీపంలోని వానవనంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు శుక్రవారం ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ తెలిపారు. ఉదయం 7 గంటలకు వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తామన్నారు. 7.30 గంటలకు వడలు, తమలపాకులతో పూజ, 8 గంటలకు నైవేద్యం, హారతి, 9 గంటలకు భజన, అల్పాహార వితరణ జరుగుతుందన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## అమ్మవారి భక్తులకు అన్నదానం

చంద్రగిరి, అక్టోబర్ 31 ప్రభాతవార్త:



సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి భక్తులకు చంద్రగిరి పాతపేట, కాపువీధికి చెందిన దివంగత చెంగల్రాయులు రెడ్డి జ్ఞాపకార్థం కుమారులు కాపువీధి తులసిరామ్ రెడ్డి, కాపువీధి సునీల్ రెడ్డి (కాపువీధి బ్రదర్స్) కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## సబ్సిడీ జనుము, జీలుగ

**నగరి, మే 31 ప్రభాతవార్త:** నగరి మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో శనివారం నుంచి జనుము, జీలుగ సబ్సిడీపై అందిస్తున్నట్లు వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున రైతులందరూ మీ రైతు భరోసా సిబ్బందిని సంప్రదించాలన్నారు. రూ.88 పలికే 10 కేజీల బ్యాగు సబ్సిడీపై రూ.44కు అందిస్తామన్నారు. రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

# తిరుపతి డివిజన్

## డి. ఫార్మసీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి విద్య, మే 31 ప్రభాతవార్త :

రెండేళ్ల డి. ఫార్మసీ కోర్సులో 2024 - 25 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి ఎస్వి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. వై. ద్వారకనాథ రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్ బైపిసి లేదా ఎంపిసి రెగ్యులర్ లేదా ఓపెన్‌లో చేసిన వారు అర్హులు. విద్యార్థులు ఈ క్రింద తెలిపిన వెబ్ సైట్ నందు అప్లై చేసి, ఒక అప్లికేషన్ కాపీని తిరుపతి ఎస్వి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఫార్మసీ డిపార్ట్మెంట్ నందు ఇవ్వవల్సిందిగా తెలిపారు. లేదా అప్లికేషన్‌ని క్రింద తెలిపిన నెంబర్లుకి వాట్సాప్ చేయవచ్చునని ధ్రువ పత్రాలు 10వ తరగతి మార్కుల జాబితా, ఇంటర్ మార్కులు జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రము, రైస్ కార్డు, 6 నుండి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్, ఒక ఫోటో అప్లై చేయుటకు చివరి తేది జూన్ 15 అని తెలిపారు. అప్లై చేయవల్సిన వెబ్ సైట్ లింక్ హెచ్‌టిటిపిఎస్, ఏపిఎస్‌బిటి ఇటీఇన్, ఫార్మసి, ఇతర వివరములు కొరకు 9908857585, 9966761446 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

## ఉయ్యాలసేవలో తరించిన పద్మావతీదేవి అమ్మవారు

నారాయణవనం, మే 31 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## చింతచెట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు..!

నారాయణవనం మే 31 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ పరిధి తిరుమల తిరుపతి దేవస్థానంకు సంబందించి తామరగుంట పుష్కరణీ ఘాటు చుట్టు వున్న ఒక అతిపెద్ద చింతచెట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో దట్టమైన మంటలతో శుక్రవారం ఉదయం వరకు మండింది. అంతేకాకుండా పక్కనే వున్న చింత చెట్లకు కూడా మంటలు వ్యాపించింది. సమాచారం తెలుసుకున్న పుత్తూరు అటవీశాఖ అధికారులు మంటలను ఆర్పారు.

## భవిత పాఠశాలలో ప్రత్యేక అవసరాల గల పిల్లలను చేర్పించుటకు సర్వే

నారాయణవనం, మే 31 ప్రభాతవార్త :



సమిత ఉపాధ్యాయు(ఐఈఆర్‌టి)లు మే1 నుంచి 30 రోజులు పాటు మండలంలో నిర్వహించిన ప్రత్యేక అవసరాల గల పిల్లల గురింతపు ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో డోర్ టు డోర్ సర్వేలను జిల్లా సహిత విద్యా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. మండలకేంద్రంలోని నారాయణవనం గణపతినగర్, సింగిరి యానాధికాలనీ, వెత్తలతడుకు, పాలమంగళం ఉత్తరపుకండ్రిగ, తుంబూరుకు వచ్చి సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సహిత ఉపాధ్యాయులు గుర్తించి పిల్లలను, వారి తల్లితండ్రులతో చర్చించారు. అలాగే వారికి ఫిజియోదెరఫీ చేసే సమయంలో భత్యాలను సక్రమంగా అందించాలన్నారు.

## గ్రంథాలయంలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్

నారాయణవనం, మే 31 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని శాఖా గ్రంథాల యంలో ఈనెల 15వతేది నుంచి జూన్ 7వ తేది వరకు సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారి జీవన్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8-11.39 గంటల వరకు విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చెప్పించడం, గ్రామర్, డ్రాయింగ్, పెయింటింగ్ మరియు ఇతర కార్యక్రమాలను జరిపిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు మరింత మంది తరలివచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## దివ్యాంగులు బడిబాటే లక్ష్యం

వడమాలపేట, మే 31 ప్రభాతవార్త:



ప్రతి దివ్యాంగుడు బడిలో ఉండాలన్నదే లక్ష్యమని సమగ్ర శిక్ష, సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖ ర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వడమాలపేట మండ లంలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వడమాల వడ్డిపల్లి గ్రామానికి వెళ్లి దివ్యాంగుడు తేజస్వరూప్ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. క్రమం తప్పకుండా బడికి పంపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల భవిష్యత్‌కు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ప్రతి దివ్యాంగుడు బడిలోఉండాలన్న లక్ష్యంతో సమగ్ర శిక్షా ద్వారా సర్వే నిర్వహించి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 18 సంవత్సరాల లోపు 111 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారన్నారు. తమ పిల్లల ఎదుగుదలకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

## వినాయకస్వామి వార్షికోత్సవ వేడుకలు

పుత్తూరురూరల్, మే 31 ప్రభాతవార్త:



పుత్తూరు మండల పరిధిలోని కైలాసపురం గ్రామంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయకస్వామి 26వ సంవత్సర వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీ వరసిద్ధి వినాయకస్వామికి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం, ఆలయ ఆవరణలో అన్నదానం కార్యక్రమం కూడా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో సంస్కృతి కార్యక్రమం నిర్వహించి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

## భక్తి శ్రద్ధలతో గెరిగె ఊరేగింపు

పుత్తూరురూరల్, మే 31 ప్రభాతవార్త:



పుత్తూరు మండల పరిధిలోని ఉత్తరపు కండ్రిగ గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ అంకాళ పరమేశ్వరి అమ్మవారి తిరుణాళ్ళ సందర్భంగా శుక్రవారం సాయంత్రం గెరిగెను పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు చేశారు. సాయంత్రం డప్పు వాయిద్యాలు నడుమ ప్రత్యేక పుష్పాలతో అలంకరించి గెరిగెను పురవీధుల్లో ఊరేగించారు. ఈ గెరిగెను ఏడు గ్రామాల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించిన కండెక్టర్

పుత్తూరురూరల్, మే 31 ప్రభాతవార్త:



పుత్తూరు ఆర్టీసీ డిపోలో కండెక్టర్‌గా 26 సంవత్సరాలు పని చేసి మే 31న పదవీ విరమణ పొందిన తాతిరెడ్డి ఇరగమరెడ్డిని పుత్తూరు మండల విద్యాశాఖ అధికారులు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ మంగమ్మ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉద్యోగంలో చేరక ముందు గ్రామీణ ప్రాంతమైన తన సొంత ఊరు బ్రాహ్మణపల్లిలో పలువురు పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడంతో పాటు పలువురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో విశేషమైన కృషి చేశారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో పుత్తూరు డిపో అసిస్టెంట్ మేనేజర్ మంగమ్మ, రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్జునయ్య, రీజినల్ ప్రెసిడెంట్ జి.వి.ముని, రీజినల్ సెక్రటరీ నరసింహులు, పెనగలూరు ఎంఈవో ఎం.గిరివరదయ్య, కేశవులురెడ్డి డిగ్రీ కాలేజీ లెక్చరర్, టి.నిర్మల స్కూలు అసిస్టెంట్, పుత్తూరు ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కండెక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది హాజరై ఇరగమరెడ్డిని ఘనంగా సన్మానించారు.

# ఎగ్జిట్ పోల్స్ వెల్లడి సమయంలో ఇళ్ళలోనే ప్రజలు

**- ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు రోడ్లపై రావద్దు**
**- 144 సెక్షన్ ఉల్లంఘిస్తే కేసులు నమోదు**
**- ఎస్పీ మణికంఠ చందోలు హెచ్చరిక**



చిత్తూరు, మే 31 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ శనివారం వెల్లడి కానున్న నేపథ్యంలో ఎగ్జిట్ పోల్స్ ప్రసార మాధ్యమాల్లో ప్రసారం అయ్యే సమయంలో ప్రజలు ఇళ్ళలోనే వుండాలని ఎస్పీ మణికంఠ చందోలు స్పష్టం చేశారు. ఎగ్జిట్ పోల్స్ శనివారం సాయంత్రం 6.30 గంటలకు వెల్లడికానున్న నేపథ్యంలో ఎస్పీ మణికంఠ చందోలు శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్తలను విలేకరులకు వివరించారు. ఎగ్జిట్ పోల్స్ అనంతరం కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రజలెవ్వరు రోడ్డుపై తిరగకూడదని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతల సంరక్షణకు పోలీసు శాఖకు ప్రజలు పూర్తి సహకారం అందించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 144 సెక్షన్ అమలులో వుందని, 144 సెక్షన్ అమలు నిర్ణయం ప్రజల రక్షణ కోసం తీసుకున్న నిర్ణయమన్నారు. ఈ సెక్షన్ ప్రకారం ఒక ప్రదేశంలో నలుగురు లేదా అంతకుమించి ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడదని, దీనిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎగ్జిట్ పోల్స్ వచ్చిన అనంతరం ప్రజలు రోడ్లపై వస్తే అనుచిత పరిస్థితులు నెలకొనే అవకాశం వుంటుందని, ఎగ్జిట్ పోల్స్ ఫలితాల ఆధారంగా తీసుకొనే నిర్ణయాలు ప్రజల్లో చికాకులు, ఘర్షణలకు దారితీయవచ్చునన్నారు. పోలీసులు 144 సెక్షన్ అమలు కఠినంగా చేయాలని, శాంతిభద్రతలను కాపాడే క్రమంలో పోలీసులు తీసుకునే చర్యలు ప్రజలకు కొంత అసౌకర్యం కలిగించినప్పటికీ భవిష్యత్తులో మంచి జరుగుతుందన్నారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలను ప్రజలు మీడియా వనరుల ద్వారా మాత్రమే తెలుసుకోవాలని, సోషల్ మీడియాలో వచ్చిన అనధికారిక ఫలితాలు, అపోహలు ప్రజలను తప్పుదోవ పట్టించే అవకాశం వుందన్నారు.

## ఎంఈవో కార్యాలయానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలు



తొట్టంబేడు, మే 31 ప్రభాతవార్త : కొత్త విద్యాసంవత్సరానికి త్వరలోనే పాఠశాలలు పునః ప్రారంభమవు తుండడంతో పాఠ్యపుస్తకాలు ఎంఈవో కార్యాలయానికి చేరుకుంటున్నాయి. శ్రీకాళహస్తి విద్యాశాఖ కార్యాలయానికి తొలివిడతలో భాగంగా 1 నుంచి 7వ తరగతి వరకు 45,396పుస్తకాలు వచ్చాయని ఎంఈఓలు భువనేశ్వరి, అంబటి బాలయ్యలు తెలిపారు. పుత్తూరు డివైఇఓ ప్రభాకర్‌రాజు శుక్రవారం శ్రీకాళహస్తి ఎంఈవో కార్యాలయంలో పుస్తకాలు పరిశీలించారు. ఇక నోటుపుస్తకాలు, బెల్టులు, సమవస్త్రాలు వచ్చాయని తెలిపారు. పూర్తిస్థాయిలోపుస్తకాలు వచ్చాక ఉన్నతాధికారుల ఆదేశాలతో సంబందిత పాఠశాలలకు చేర్చుతామన్నారు. ఇక తొట్టంబేడు మండలంలో 1-7 తరగతుల వరకు 22 రకాల పుస్తకాలు వచ్చాయని వీటితో పాటు బెల్టులు, నోటుపుస్తకాలు వచ్చాయని ఎంఈవో 2 భాస్కర్ తెలిపారు. నేడు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత ఉన్న ఉపాధ్యాయులుతో పాటు అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు.

## పంటపొలాలపై జంట ఏనుగుల దాడులు

**– రైతులకు లక్షలాది రూపాయల నష్టం !!**



**కుప్పంరూరల్, మే 31 ప్రభాతవార్త :** మండలంలోని వసనాడు, పైపాళ్యం, నడిమూరు, ఉర్లఓబనపల్లి ప్రాంతాల్లో జంట ఏనుగులు పంట పొలాలపై దాడులు చేశాయి. గురువారం అర్ధరాత్రి జంట ఏనుగులు ఈ నాలుగు గ్రామాల మీదుగా సంచరించి పంటలను నాశనం చేశాయి. వసనాడు గ్రామంలో రైతులు కళ్యాణమ్మ, రేణుకారాంలకు చెందిన వ్యవసాయ పొలంలో సాగులో ఉన్న టమోటా తోటను, డ్రిప్ పైపులను తొక్కి ధ్వంసం చేశాయి. దీంతో సుమారు మూడు లక్షల దాకా నష్టం కలిగినట్లు బాధిత రైతులు పేర్కొన్నారు. అలాగే నడిమూరు, ఉర్ల ఓబనపల్లి ప్రాంతాల్లో సైతం పలు పంటలను నాశనం చేశాయని రైతులు వాపోతున్నారు. శుక్రవారం ఉదయం నడిమూరు వద్ద ఏనుగులు కుప్పం – కృష్ణగిరి జాతీయ రహదారిని దాటాయి. అటవీ అధికారులు జంట ఏనుగులను ఊరినాయనపల్లి, జరుగు అటవీ ప్రాంతం నుంచి తమిళనాడు అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి వరకు ఏనుగుల జాడను గుర్తించి వాటిని దారిమళ్లించే యత్నాల్లో ఉన్నారు. హఠాత్తుగాజంటఏనుగులదాడిలో పంటలు కోల్పోయిన తమకు ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## శ్రీప్రసన్న రంగనాధ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**-సూర్యప్రభ వాహనంపై భక్తులను కనువిందు చేసిన రంగనాధస్వామి**

తిరుపతిరూరల్, మే 31 ప్రభాతవార్త:



కలియుగ వైకుంఠమగు తిరుమల తిరుపతికి ఆగ్నేయ దిశన అలిమేలు మంగాపురం నుండి సుమారు 5కిలోమీటర్ల దూరంలో అప్పలాయగుంటకు వెళ్ళే మార్గమధ్యన వున్న బ్రాహ్మణపట్టు గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న రంగనాధ స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయిన విషయం తెల్సిందే. తిరుపతి రూరల్ బ్రాహ్మణపట్టులో వెలసిన శ్రీప్రసన్న రంగనాధ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుండి జూన్ 6వ తేదీ వరకు జరుగునని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 30న గురువారం ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం హంసవాహనం, 31న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, జూన్01వ తేదీన శనివారం ఉదయం శేష వాహనం, సాయంత్రం స్వామివారి కళ్యాణోత్సవం, 2వ తేదీన ఉదయం హనుమంత వాహనోత్సవం, సాయంత్రం గరుడోత్సవం, 3వ తేదీన ఉదయం సింహ వాహనోత్సవం, సాయంత్రం గజ వాహనోత్సవం, 4వ తేదీన ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వ వాహనోత్సవం, 5వ తేదీ ఉదయం పుష్పయాగం, సాయంత్రం శయనోత్సవం నిర్వహించబడునని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో చిరుద్యోగి మృతి

**-ఆర్అండ్‌బి నిర్లక్ష్యం... ప్రజలకు శాపం**

శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తి-ముచ్చివోలు రోడ్డు మార్గంలో అక్కుర్తి సమీపంలో ఆర్అండ్‌బి నిర్మిస్తున్న అర్థాంతరంగా ఆగిన ఓ కల్వర్టు వద్ద విద్యుత్ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగిగా ఉన్న ప్రమాద వశాత్తు మృతి చెందినట్లు సమాచారం అందింది. ఆతనిమృతికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏర్పేడు మండలం పల్లం దళితవాడకు చెందిన ఆశోక్(35) శ్రీకాళహస్తిలోని విద్యుత్‌శాఖలో కాంటాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఆతను గురువారం రాత్రి విధులు ముగించుకొని స్వగ్రామానికి తమ మోటార్ సైకిల్‌పై వెళుతుండగా కల్వర్టు లోపల పడిపోయినట్లు గుర్తించారు. ఈ మార్గంలో వచ్చే



వాహన చోదకులు చూసి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అయితే కల్వర్డు కాలువలో పడటంతో తలకు బలమైన గాయమై అక్కడి కక్కడే మృతి చెందినట్లు తెలిసింది. మృతుడు ఆశోక్‌కు వివాహమై మూడు సంవత్సరాలలైంది. కానీ పిల్లలు లేరని తెలిసింది. ఇంటికి ఆధారంగా ఉన్న కొడుకు ఆకాల మృతి చెందటంతో ఆ కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. అందరికితో కలగొలుపుగా వ్యవహారించే ఆశోక్ మృతితో వాడలో కూడా విషాదం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వెంకటాచలపతి సేవలు అభినందనీయం

శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఓగా పనిచేస్తున్న వెంకటాచలపతి శుక్రవారం పదవీవిరమణ పొందారు. ఈసందర్భంగా శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో పదవీవిరమణ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సందర్భంగా ముఖ్యఅతిధిగా తహశీల్దార్ జనార్దన్‌రాజు మాట్లాడుతూ వెంకటాచలపతి విఆర్ఓగా కెవిబిపురం, శ్రీకాళహస్తి మండలాల్లో అనేక సేవలు అందించారని విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారన్నారు. కాగా ఆయన్ను కె.భరత్‌రెడ్డి, కార్తీక్‌చౌదరిలు సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఆర్ఐలు దివాకర్, విఆర్ఓలు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఫించనుదారులకు నగదు వారి ఖాతాల్లోనే..

శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త :



నేటి నుంచి లబ్దిదారులకు అందజేస్తున్న ఫించన్లపై పురపాలక సంఘ కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ఈనెల వృద్దులు, వికలాంగులు, వితంతువులుకు ఇచ్చే ఫించను నేరుగా ఈసారి వారివారి ఖాతాల్లోనే జమచేయనున్నట్లు తెలిపారు. అనారోగ్యకారణాలు, వీల్‌చైర్‌లకు పరిమితమైన వారికి, సైనిక్ సంక్షేమ ఫించను పొందుతున్న యుద్దవీరుల వృద్ద వితంతువులకు మాత్రం గత నెలలో వలె గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా వారి ఇంటి వద్దకే వచ్చి ఫించను ఇస్తామన్నారు.

## తెదేపా నాయకుడికి పరామర్శ

తొట్టంబేడు, మే 31 ప్రభాతవార్త :



మండలంలోని కాసారం గ్రామ పంచాయతీకి చెందిన తెలుగుదేశంపార్టీ యువనాయయుడు బొర్రాసుబ్రమణ్యం ద్విచక్రవాహనంమీద వెళ్తుండగా శ్రీకాళహస్తి నుంచి కాసరంగ్రామానికి వెళ్తుండగా చియ్యవరం వద్ద కుక్కలు దాడిచేయడంతో ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి కాలు విరగడంతో తిరుపతిలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది స్వగ్రామానికి చేరుకోవడంతో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు పరామర్శించి త్వరగా కోలుకోవాలని తెలిపారు. పరామర్శించిన వారిలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చింతపట్ల భాస్కర్‌నాయుడు, మాజీ సర్పంచ్ శ్రీరాంచెంచయ్య, సీనియర్ నాయకులు రత్నయ్యనాయుడు, చెన్నురాఘవులుయాదవ్, బింగిబాలాజీ, మహేష్‌నాయుడు, ఎస్సీ సెల్ నాయకులు సాలిరాజ, చియ్యవరం గురవయ్య, గిరి, వెంకటరమణ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## భజే..వాయువేగం

**-ఆకట్టుకుంటున్న కలంకారి చిత్రం**

శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త :



నేడు హనుమాన్ జయంతి సందర్భంగా భజే వాయువేగం..అన్న వ్యాఖ్యంతో పట్టణంలోని గోపాలవనం వద్ద నివాసం ఉంటున్న గౌరీ, మునికృష్ణయ్యల కుమారుడు కలంకారి కళాకారుడు గొల్లమునిబాబు భజేవాయువేగం అన్నట్లుగా కలంకారి కళాఖండాన్ని అద్భుతంగా చిత్రీకరించి మేఘాలకన్నా వేగంగా, గాలికన్నా వేగంగా హనుమంతుడు ఆకాశంతో ఉన్న సూర్యుడుని మామిడిపండని తినడానికి వేగంగా వెళ్ళడంతో ఇంద్రుడు అడ్డుకుని వజ్రాయుధంతో హనుమంతుడిని కొట్టడంతో స్పృహతప్పి కిందపడిపోతాడు. దీంతో హనుమంతుడి తల్లి అక్కడకు చేరుకుని భూమిని స్తంభించడంతో వెంటనే ఇంద్రుడు ప్రత్యక్ష్యమై అభయమివ్వడంతో తిరిగి హనుమంతుడు మృత్యుంజయుడవుతారు. దీంతో శ్రీకాళహస్తీశ్వరాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడంతో పాటు బంగారమ్మ కాలనీ వద్ద ఉన్న నిలువెత్తు విగ్రహానికి అభిషేకాలు పూజలు చేయనున్నారు. కళాకారుడు టిటిడి దేవస్థానంలో రెండేళ్ళ సర్టిఫికెట్ కలంకారి కోర్సు చేసినట్లు వివరించారు. ఈసందర్భంగా మునిబాబును పలువురు అభినందించారు.

## గెలుపుపై ధీమా ఒకరికి...ఆశ మరొకరికి

**-బెట్టింగులతో రాజకీయం రసవత్తరం**

శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త :



గత నెల 13న ఎన్నికలతో, ఓటర్లు తమ తీర్పును ఇవిఎంలకు అప్పగించారు. అయితే మహిళా ఓటర్లు అత్యధికంగా హాజరై ఓట్లు వేసారని, ఈ అంశం తమకే అనుకూలమని ఒకరు కాదు మాకు అనుకూలమని మరొకరు అంచనాలు వేసుకుంటున్నారు. ఈ నేపధ్యంలో మరో 4రోజుల్లో ఫలితాలు వెలువడనున్నాయి. దాంతో జోరుగా హుషారుగా ఎవరికి వారు బెట్టింగుల్లో తలమునకలై ఉన్నారు. ఎవరికి వారు విజయంపై ధీమాగా ఉన్నారు. అయితే బెట్టింగ్ మహారాజులు కొత్త ఆవతారం ఎత్తారు.

**ఎవరి ధీమా వారిది:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఒక్కసారిగా ఫలితాలను అంచనా వేయటం కష్టం. అయితే అధికారంలో ఉంటూ పోటీ చేసిన వైకాపా అభ్యర్థి సిట్టింగ్ ఎంఎల్ఏ బియ్యపు మధుసూదనరెడ్డి ఐదేళ్ళ పాటు నియోజకవర్గంలో కంటికి రెప్పలా కాపాడుతూ ప్రజలకు అందుబాటులో ఉన్నారు. అతనే కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి తన తనయను కూడా అందుబాటులో పెట్టారు. ఎవరు ఏ సమస్యతో వచ్చినా పరిష్కారానికి చొరవ చూపారు. అంతేకాక ప్రభుత్వ పథకాలే కాకుండా నిరుపేద ప్రజలకు ఇతోధిక సహాయం అందించారు. రెండవ సారి గెలిచేది మనమే అని ధీమాతో ఉన్నారు.

**వారి తప్పిదాలే మా విజయానికి పునాదులు:**

ఇక తెలుగుదేశం పార్టీ తరఫున రెండవ సారి పోటీ చేసిన బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఐకూడా ఐదేళ్ళ పాటు అధికార పార్టీ తప్పిదాలు, అక్రమాలు, అక్రమణలు, దౌర్జన్యాలు, దాడులు, పోలీసు కేసులు పథకాలు కొందరికి అందటం, అభివృద్ధి కొరవడటం లాంటి అంశాలు తమకు అనుకూలంగా ఉందని అంటున్నారు. గతంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథకంలో నడిపిన తన తండ్రి గోపాలకృష్ణారెడ్డి సేవలు అనుకూలంగా ఉన్నాయని భావిస్తున్నారు. అన్నింటి కన్నా 'జనం మార్పు' కోరుకున్నారని ఇది తమకు ఎంతో అనుకూలిస్తుందని కాబట్టి విజయం తమదే అని భావిస్తున్నారు. మరి శనివారం విడుదలయ్యే ఎగ్జిట్ పోల్స్ ఏం చెబుతుందో? జూన్ 4న ఈ వి ఎంలు ఏ ఫలితాలు ఇస్తాయో వేచి చూడాలి.

## టాస్క్‌పోర్సు ఆవరణలోని అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదం

తిరుపతి కార్పొరేషన్, మే 31 ప్రభాతవార్త :



ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ పోర్సు కార్యాలయం వెనుక వైపు ఉన్న అటవీ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అక్కడి చెట్లు కాలిపోయాయి. దీంతో అప్రమత్తమైన టాస్క్ పోర్సు సిబ్బంది ఎస్పి శ్రీనివాస్‌కు సమాచారం అందజేసారు. ఆయన ఆదేశాలతో వెంటనే ఫైర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ ఉన్న టాస్క్‌ఫోర్సు సిబ్బంది మంటలను అదుపు చేస్తుండగా అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పారు. దీంతో ఆస్తి, ప్రాణ నష్టాలు జరగలేదని టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపారు. ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడానికి కారణాలపై విచారణ చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు అక్కడ మండలకు బాధ్యులై ఉండవచ్చునని భావిస్తున్నారన్నారు.

## పొగాకు ఉత్పత్తులు ప్రాణాంతకాలు

**రేణిగుంట, మే 31 ప్రభాతవార్త:** పొగాకు ద్వారా తయారైన సిగరెట్లు, బీడీలు, చుట్టల ద్వారా వచ్చే ధూమాన్ని పీల్చడం, పొగాకు ఉత్పత్తులను నమలడం, సేవించడం ప్రాణాంతకమని ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్, ప్రధాన కార్యదర్శి డా. మర్దాల రవిబాబు అన్నారు. రేణిగుంట పట్టణంలోని ప్రధాన వీధుల్లో అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం, పర్యవేక్షణలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభమై గాంధీ విగ్రహం మీదుగా రైల్వేస్టేషన్ వరకు శుక్రవారం ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు పొగాకు వల్ల జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమం లో ఆషాస్వచ్ఛంద సేవా సంస్థ జూలియన్ రాజు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్‌కామరాజు, టాటాట్రస్టు తిరుపతి జిల్లా కో-ఆర్డినేటర్ హేమంత్‌కుమార్, ఆశ వర్కర్ల హ్యూమన్ రైట్స్ సభ్యులు ఆడేపూడి రాజ్‌కుమార్, మహేంద్ర, పద్మనాభం ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## అవాంచనీయ సంఘటనలకు చోటులేదు : ఎస్ఐ



**తొట్టంబేడు, మే 31 ప్రభాతవార్త :** సార్వత్రిక ఎన్నిలక ప్రక్రియ ముగిసిన నేపధ్యంలో నేడు ఎగ్జిట్ పోల్స్ విడుదల కానున్నాయని దీంతో ముందస్తుగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలుతీసుకుంటున్నామని తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మండలంలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జగరకుండా పోలీసులను సిద్దంచేశామని 144సెక్షన్ అమలులో ఉన్నందున ఐదుమంది కంటే ఎక్కువగా గుంపులు ఉండరాదన్నారు. అలాగే బాణాసంచాకాల్చడం, విజయోత్సవ ర్యాలీలు, ఒకపార్టీ వర్గం మరో పార్టీని విమర్శించడం వంటివి చేయరాదన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలుతీసుకుంటామని ఇందుకు నాయకులు కూడా సహకరించాలని ఎస్ఐ తెలిపారు.

## కేంద్రహోంశాఖ మంత్రికి ఘనంగా వీడ్కోలు

.శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త



కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ కుటుంబసభ్యులతో తిరుమల దర్శనానికి విచ్చేసిన సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్, అసెంబ్లీ కో కన్వీనర్ నేతృత్వంలో తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనకు ప్రత్యేకంగా తయారుచేసిన తామర పుష్పాలుతో గజమాలతో సత్కరించి ఆయనకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర సభ్యులు ఎస్వీరమణ, కంద్రిగ. ఉమ, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## చెరువులో పడి విద్యార్థి దుర్మరణం!

**కేవీబీ పురం, మే 31 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలోని బ్రాహ్మణపల్లి చెరువు నీటిలో అదే గ్రామం దళితవాడకు చెందిన పిడుగు దయాకర్ సోలమ్మ కుమారుడు పిడుగు మునేంద్ర(11) పడి మృత్యువాత పడినట్లు కేవీబీ పురం మండలం వైస్ ఎంపీపీ బ్రాహ్మణపల్లి ఎంపీటీసీ సభ్యులు దేరాల శ్రీనివాసయాదవ్ తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో గ్రామానికి చెందిన విద్యార్థులు మైదానంలో క్రికెట్ ఆడడం నీటిలో సరదాగా ఈతల కొట్టడం అలవాటు. ఇందులో భాగంగా గురువారం మునేంద్ర విద్యార్థులతో కలసి క్రికెట్ ఆడి అనంతరం చెరువులోని చేపలు పట్టే తెడ్డు(చిన్నపాటి పడవ)లో సరదాగా ముగ్గురు విద్యార్థులు నీటిలో కొంచెం దూరం ప్రయాణంచేసి పడమర తట్టు నుంచి తూర్పు తట్టు ఒడ్డుకు చేరుకునే సమయంలో మునేంద్ర కొంచెం ముందుగానే దాటుకోవడంతో కాలు జారి నీటిలో పడి మృత్యువాత పడ్డాడు. మునేంద్ర ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదివి వేసవి సెలవులు అనంతరం ఐదో తరగతికి వెళ్లాల్సి ఉంది. ఈ సందర్భంగా మునేంద్ర మృతదేహాన్ని ఉపాధ్యాయులు గజేంద్రయ్య సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ దేరాల శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునే విధంగా మేలు చేస్తామని తెలిపారు.

## స్ట్రాంగ్ రూమ్స్ నుండి జాగ్రత్తగా కౌంటింగ్ కేంద్రానికి ఇవిఎంలు

**- చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ పి.శ్రీనివాసులు**

చిత్తూరు, మే 31 ప్రభాతవార్త:



స్ట్రాంగ్ రూమ్స్ నుండి కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను కౌంటింగ్ కేంద్రాలకు జాగ్రత్తగా చేర్చాలని జాయింట్ కలెక్టర్, చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు అన్నారు. జాయింట్ కలెక్టర్ సమావేశహాలులో శుక్రవారం జెసి పి.శ్రీనివాసులు చిత్తూరు, గుడిపాల తహసిల్దార్లు, ఎఆర్ఓలు శ్రీనివాసులురెడ్డి, విజయలక్ష్మిలతో కలిసి ఓట్ల లెక్కింపు కేంద్రంలో విధులు కేటాయించిన అధికారులు, సిబ్బందితో ఓట్ల లెక్కింపు రోజు నిర్వహించాల్సిన విధులుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ జూన్ 4న ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా స్ట్రాంగ్ రూమ్స్, సీలింగ్ రూమ్స్ వద్ద వున్న ఇన్‌ఛార్జీలు జాగ్రత్తగా సియు, బియులను కౌంటింగ్ కేంద్రంకు పంపాలన్నారు. అంతకుముందు, కౌంటింగ్ పూర్తయిన అనంతరం సీలింగ్ రూమ్స్‌లో భద్రపరిచేటప్పుడు తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత వారి నుండి సంతకాలు తీసుకోవాలని స్ట్రాంగ్ రూమ్స్, సీలింగ్ రూమ్స్ ఇన్‌ఛార్జీలను ఆదేశించారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం మూడు టేబుల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. టేబుల్స్ వద్ద స్టేషనరీతో పాటు అన్ని రకాల ఫార్మేట్స్, పిఎస్‌ల వారీగా పోల్ డేటా, 17సి తదితరాలు సిద్ధంగా వుంచాలన్నారు. జూన్ 3వ తేదీ మధ్యాహ్నానికి అన్ని కార్యక్రమాలు పూర్తి చేయాలని ఏఆర్ఓలను ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఎవరికి కేటాయించిన విధులను వారు జాగ్రత్తగా పొరబాట్లకు తావు లేకుండా నిర్వహించాలని అధికారులు, సిబ్బందిని జెసి ఆదేశించారు. ఈ సమావేశంలో చిత్తూరు రూరల్ మండల తహసిల్దారు హసినాబీ, డిటిలు కిరణ్‌కుమార్, హిమగిరి, ధనంజయులు, ఎఎస్ఓ సౌందర్‌రాజన్, సర్వేయర్ సునీత, ఆర్ఐ సాయిరామా, ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో ముగిసిన రోటోబిక్ శిక్షణా తరగతులు

కోట, మే 31 ప్రభాతవార్త :



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో గత మూడురోజులుగా జరుగుతున్న ఇండస్ట్రియల్ రోబోటిక్స్‌పై శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ శిక్షణా తరగతులకు రాష్ట్రంలోని పలు కళాశాలల నుంచి 20 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు హాజరయ్యారు. డాక్టర్ ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వర్లు ఇండస్ట్రియల్ రోబోటిక్స్ ప్రోగ్రామింగ్ సిమిలేషన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌బికెఆర్‌లో మెకానికల్ విభాగంలో ఆధునిక రోబోటిక్స్ ల్యాబ్‌లు ఉన్నాయని, ఇందులో ప్రముఖ కంపెనీలైన కోకో, ఎబిబి ఇండస్ట్రియల్ రోబోటిక్స్ ఉన్నాయని, ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రముఖ బహుళజాతి కంపెనీలలో ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం

వాకాడు, మే 31థ ప్రభాతవార్త:



శాంతి భద్రతలు ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం వాకాడు మండలంలోని దుగ్గరాజుపట్నం, కొండూరు పాలెం, జెమిని కొత్తపాలెం, తూపిలిపాలెం గ్రామాలలో డిఎస్‌పితో పాటు వాకాడు సిఐ హరికృష్ణ, ఎస్ఐ పవన్ కుమార్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రజలను ఉద్దేశించి డిఎస్పి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గొడవలను పెంచుకోకుండా తమ పని చేసుకుని జీవనోపాధి మెరుగుపరచుకోవాలని, ఆయన సూచించారు. అదే విధంగా చట్టాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో గానీ, జాతర సమయంలో గాని, జరగబోయే ఎన్నికల కౌంటింగ్ సమయంలో గానీ గొడవలు పెంచుకో రాదని తెలిపారు. గ్రామాల్లో పెద్ద పెద్ద బాణాసంచాలు పేల్చరాదని డిఎస్పి సూచించారు. గ్రామాల్లో శాంతి భద్రతలును ఉల్లంఘించిన, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వాకాడు పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు.

## పరిసరాల అపరిశుభ్రత రోగాలకు మూలం

**-జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జి.కె.రూప్‌కుమార్**

చంద్రగిరి, మే 31 ప్రభాతవార్త:



మీ ఇంటి పరిసరాల అపరిశుభ్రత రోగాలకు మూలకారణం కాగలవని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జి.కె.రూప్‌కుమార్ అన్నారు. స్థానిక బి.డి కాలనీలో శుక్రవారం ఆయన పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో డెంగీ నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దోమకాటు కారణంగా సంక్రమించే డెంగీ నివారణకు దోమతెరలను వినియోగించాలన్నారు. మీ ఇంటి ముందు కాలువలలో చెత్తపేరుకుపోకుండా పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే చేపట్టి మన ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా శుభ్రంగా వుంచుకోవాలన్నారు. నీటి నిల్వ కారణంగా దోమలు చేరుతాయనీ, దోమకాటు వలన డెంగీబారిన పడే ప్రమాదం వుందన్నారు. ఈ కార్యక్రమంలో కొటాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.కుసుమ, ఎస్‌యుఓ శివయ్య, ఎంపిహెచ్ఈఓ ఈశ్వరయ్య, సూపర్‌వైజర్ టాటాబాయి, ఎంపిహెచ్ఎస్ ఎస్.శ్యామల, వాసుదేవ, వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మమహత్యం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

తిరుపతి, మే 31ప్రభాతవార్త:



తిరుపతి నగరగ్రామదేవత ,ఇలవేల్పు తాతయ్యగుంట గంగమ్మతల్లి మహత్యం ప్రత్యేక సంచికను రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఆవిష్కరించారు. తిరుపతిలో గ్రామదేవత గంగమ్మ పుట్టుక, అమ్మవారి ఆలయం, తల్లి మహత్యం వివరాలు స్పష్టంగా ముద్రించారు. ఈ పుస్తకాన్ని శుక్రవారం ఉదయం రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, సంచిక సంపాదకుడు కెఎన్ రాజ, యువ శతావధాని ఉప్పలధడియం భరత్‌శర్మ, కస్పాపద్మనాభం గంగమ్మతల్లి మహత్యం వివరించారు. తల్లి మహత్యాన్ని దశదిశలా వ్యాపింపజేయడానికి ఈ ప్రత్యేక సంచికను తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంపాకుడు కెఎన్ రాజ, యువ శతావధాని ఉప్పలధడియం భరత్‌శర్మ, కస్పా పద్మనాభం లను రాయలసీమ రంగస్థలి గుండాల గోపీనాధరెడ్డి, కొత్తపల్లి మునిరత్నం, శంకరయ్య, అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్, కొట్టే చెంగారెడ్డి, దొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేలో ఆయన సేవలు స్ఫూర్తిదాయకం

తిరుపతి, మే 31ప్రభాతవార్త:

సుదీర్ఘకాలంగా రైల్వేశాఖలో లోకోపైలట్‌గా అంకితభావంతో పనిచేసి, ప్రయాణీకులకు సురక్షిత సేవలందించిన మోహన్‌రెడ్డి అందరికీ స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. దక్షిణమధ్యరైల్వేలో ఉద్యోగిగా బాధ్యతలు చేపట్టిన మోహన్‌రెడ్డి 20సంవత్సరాలుపాటు రైల్వేలో తనదైన నిబద్దతతో పనిచేసిన అనుభవజ్ఞుడని తెలిపారు.




శుక్రవారం ఉదయం పదవీవి రమణ చేసిన మోహన్‌రెడ్డిని రామలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, మోహన్‌కు మార్, శాంత, కొండె చెంగారెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి ఆత్మీయ సన్మానం చేశారు. దుశ్శాలువ కప్పి జ్ఞాపికను బహుకరించారు. వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో శేషజీవితం గడపాలని ఆకాంక్షించారు.

## జూన్ 2న 2024-25 సంబంధించి, క్రీడాకారుల ఎంపిక

**తిరుపతిరూరల్, మే31 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరం క్రికెట్ సీజన్‌కు సంబంధించి ఎంపిక ప్రక్రియ జూన్ 02న జరుగునని కమిటీ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిరూరల్ తుమ్మలగుంట వైయస్సార్ క్రికెట్ గ్రౌండ్‌లో ఎంపిక ప్రక్రియ జరుగునని తెలిపారు. అండర్ 23 (పురుషులు), అండర్ 16 (బాలుర) ఎంపిక జరుగునని తెలిపారు అండర్ 16 (బాలురు)కు మాత్రం 1-9-2008 నుండి 31-8-2010 మధ్యలో జన్మించినవారు మాత్రమే అర్హులని తెలిపారు. అలాగే అండర్ 13 పురుషులు 1-9-2001 నుండి 31-8-2010 మధ్యన జన్మించినవారు అర్హులని తెలిపారు. ఎంపిక సమయంలో ఆథార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తప్పకుండా తీసుకురావాలన్నారు. ఈనెల 2వ తేదీన ఉదయం 8గంటలకు అండర్ 16 బాలురుకు, మధ్యాహ్నం 2గంటలకు నుంచి అండర్ 23 పురుషులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9849026131, 7981880381 నెంబర్స్‌ను సంప్రదించాలన్నారు.